వ్యవస్థాపకులు

**కీ||శే|| మునుగంటి శ్రీరామమూర్తి**

గౌరవ సంపాదకులు

**డా|| శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

సంపాదకుడు

**మునుగంటి వెంకట్రావు**

65వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 65 జులై, ఆగష్టు 2026 సంచిక - 2-3













65వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

సంపుటి - 65 జులై - ఆగష్టు 2026 సంచిక - 2 - 3

## ఈ సంచికలో....

పేజీలలో

1. సునాద వినోదులు - సుస్వర బేహారులు - శ్రీ మల్లాది సూరిబాబు ........ 3
2. తారకామృత సారాన్ని అందించిన వాగ్గేయకారులు గుజ్జుల నారాయణ దాసు - శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు ........ 6
3. "కర్ణాటక సంగీతం లో తెలుగుభాష పాత్ర అవినాభావ సంబంధం" - శ్రీ ఎస్.గిరిజాశంకర్ ........ 16
4. 'సుస్వర భూషణ' నారాయణ శర్మ - శ్రీ మల్లాది సూరిబాబు ........ 18
4. బహుముఖ ప్రజ్ఞ తన సరళి .. ఆయనే మన బాలమురళి.. - శ్రీ మోదుమూడి సుధాకర్ ........ 21
5. సంగీత సభల కార్యకలాపములు - 'విహారి' ........ 22

## ముఖచిత్రం

1. గానకళ గౌరవ సంపాదకులు సీనియర్ జంత్రగాత్ర విద్వాంసులు డాక్టర్ శ్రీ కొమాండూరి శేషాద్రి వారు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును గౌరవ శ్రీ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారి నుండి స్వీకరిస్తున్న దృశ్యం.
2. సుభగాత్రి ఆర్ట్స్ అకాడమీ రజితోత్సవాల్లో సన్మానింపబడిన సంగీత విద్వాంసులు శ్రీ మోదుమూడి సుధాకర్.
3. 11-7-2026 న గాయత్రి సంగీత సన్మండలి లో శ్రీమాన్ డా. వింజమూరి వరదరాజ అయ్యంగార్ మెమోరియల్ అవార్డును స్వీకరించిన విద్వాన్ శ్రీ జి. రవికిరణ్.
4. సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత డా. పంతుల రమను సన్మానిస్తూన్న విశాఖ మ్యూజిక్ అకాడమి సభ్యులు.
5. పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ స్మారక పురస్కారాన్ని విశాఖ మ్యూజిక్ అకాడమి నుండి స్వీకరిస్తూన్న శ్రీ డి.వి.మోహనకృష్ణ.
6. 1-8-2026 న గాయత్రీ మహిళా సంగీత సన్మండలి గుంటూరు వారినుండి 'గాయత్రీ సంగీత విద్వన్మణి' బిరుదు పొందిన విదుషి శ్రీమతి బి.వి. దుర్గాభవాని.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు - వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

ganakala.in వెబ్ పేజీలో గానకళ పూర్వ సంచికలు, కొత్త సంచికలు చూడవచ్చు.

గతానికి స్వాగతం

# సునాద వినోదులు - సుస్వర బేహారులు



- మల్లాది సూరిబాబు
ఫోన్ : 9182718656

జీవనది ఎప్పుడూ ఎండిపోదు. సంగీత ప్రవాహం ఎప్పుడూ నిండుకోదు. అందులో ఎవరు మునిగినా ధన్యులే. స్నానం చేసే ఓపిక లేని వారు చెంబుతో కాసిన్ని నీళ్లు చల్లుకున్నా సంగీత గంగ అనుగ్రహిస్తుంది. ఈదడం తెలిసినవారు నది మధ్యకు వెళ్లి పరమ తృప్తిగా స్నానం చేసినట్లుగా, సంగీతపు లోతుల్ని చూసి పరవశించి గానం చేస్తూ నాదమయ లోకాల్లో విహరించగలిగిన గాన గంధర్వులెందరో ఈ భూమ్మీద పుట్టారు. పాడేశారు, వెళ్లిపోయారు. సిరిసంపదలతో మూట కట్టుకుని కాదు. శ్రోతల హృదయాల్లో శాశ్వతులై తలుచుకున్నప్పుడల్లా గుర్తుకొచ్చేలా సార్థక జీవులై, కీర్తి శరీరంతోనే ఉండిపోయారు. సంగీతానికదే సార్థకత.

కాలానికి మించిన ఉత్తమ బోధకుడు, జీవితానికి మించిన మందిరం ఉండదు. కొత్తగా ఏదీ ధ్యాస తెచ్చిపెట్టకుండా మనిషిలోని ప్రజ్ఞకు ప్రకాశాన్నిచ్చేది దేవుడే. సంగీత జ్ఞానం విధాత ఇవ్వవలసి నదే. ఒకప్పుడు మన ఇళ్లల్లో సంగీతం నేర్చుకునే పిల్లలకు హార్మోనియం పెట్టె కొనిచ్చేవారు. ఆ పెట్టెలో మెట్లుపై వ్రాసిన 12 అంకెలూ, ఒక స్థాయిలోని 12 స్వర స్థానాలూ వుంటాయి. క్రింద రాసిన అంకెలు 1 నుంచి 7 వరకూ, మన గాయకులు సాధారణంగా మాట్లాడుకునే ఒకటి శృతి, రెండు శృతి అని తెల్లమెట్లు శృతులూ, ఆధార శృతిగా పాడేప్పుడు, ఒకటీ, ఒకటిన్నర, రెండున్నర అంటూంటారు. ఈ శృతుల్ని సి, సి షార్ప్, డి, డి షార్ప్, ఎఫ్, ఎఫ్ షార్ప్, పాశ్చాత్య సంగీత పరిభాషలోని మాటల్ని వాడతారు.

శృతికీ, అపశృతికీ తేడా తెలుసుకున్న వారికి సంగీతం తొందరగా వస్తుంది. మిగిలిన వారు తపస్సుగా భావిస్తేనే సిద్ధిస్తుంది. సంగీతం నేర్చుకునే పిల్లలకు నిజానికి 'హార్మోనియమ్' పెద్ద దిక్కు. షడ్జ, పంచమాలు గొంతులో పలికించినంత తేలికగా, మిగిలిన స్వరాలు, పిల్లలు పలికించటం కష్టం. హార్మోనియం శృతిలో పాడితే స్వరాల ఉనికి ఇట్టే తెలిసిపోతుంది. కానీ, ఒక స్వరానికి, మరో స్వరాన్ని కలిపి పాడటంలోని రహస్యం మాత్రం ఎదురుగా గురువు చెప్పాలి. లేదంటే అస్సలు తెలియదు. గమక సౌందర్యం తెలిసేది అది తెలిసి పాడే సద్గురువుకే. హార్మోనియంలో గమకాలు పలికించటం చాలా కష్టం. కాబట్టి, దాన్ని క్రమంగా వెనక్కు నెట్టేశారు. కానీ ఉత్తరాది సంగీతజ్ఞులకు

పెన్నిధి లాంటిది హార్మోనియం.

హిందూస్థానీ గాయకులకు, ముఖ్యంగా ఘజల్ ప్రియులను, ఆనంద లోకాల్లో విహరింపచేస్తూ, మనోధర్మానికి మార్గాన్ని చూపించే సుస్వర వాద్యం హార్మోనియం ఒక్కటే. దీని స్థానంలో కామధేనువు, కల్పతరు వృక్షంలా ఈ వేళ 'కీబోర్డ్' వచ్చి కూర్చుంది. కానీ హార్మోనియంలోని సహజ మాధుర్యం కీబోర్డు ఇవ్వలేదు. ఈ హార్మోనియంలో వినిపించే సునాదం ముందు, అత్యంత ఆధునికమైన ఏ కీబోర్డైనా దిగతుడుపే.

హార్మోనియం పేరు చెప్పగానే నేను తలుచుకునే సినీ సంగీత దర్శకుడు మాస్టర్ వేణుగా ప్రసిద్ధుడైన మద్దూరి వేణుగోపాల్.

నేను విజయవాడ రేడియో కేంద్రంలో పనిచేసే రోజుల్లో కల్పలత, శ్రోతలు కోరిన సినిమా పాటలైనా చిత్రతరంగిణి కార్యక్రమమైనా ప్రారంభించేది మాస్టర్ వేణు పాటతోనే. కారణం ఏ పాటైనా ఆయన పాట పియానోతో మొదలౌ తుంది. పాటకు మెలొడీ ఎలా వస్తుందో తెలిసిన అతి తక్కువ మందిలో వేణు ముందు వరుసలో వుంటాడు. మెలొడీ అంటే సునాదం. ఏయే స్వరాలు కలిపితే 'నాదం ఏర్పడుతుంది? ఏయే వాద్యాలు కలిపి వాయిస్తే సుస్వరంతో కూడిన నాదం ఏర్పడుతుందో అనుభవంతో నేర్చుకున్న వేణు పాటలే దీనికి నిదర్శనం. ఏ రాగంలో ఏ స్వరాలకు ఆ మాటలు నప్పుతాయో తెలిసేది సంగీత దర్శకులకే, యజమాని కంటే ఇంటి నిర్మాణం కోసం ప్లాన్ వేసే ఇంజనీర్ కు ఆ ఇంటి రూపం కనిపించేస్తుంది.

అలాగే సినీ సంగీత దర్శకుల సంగీతానుభవం అద్భుతమైన పాటలకు కారణమౌతుంది. మాస్టర్ వేణుది కృష్ణా జిల్లా మచిలీపట్నం. గుంటూరు, కృష్ణా జిల్లాలోనే కవులు, రచయితలు, నటీనటులు, సంగీత విద్వాంసులు పుట్టారనిపిస్తుంది. పుట్టిన ఊరుని వాళ్లు వదిలేసి పొట్టచేత్తో పట్టుకుని ఎక్కడెక్కడికో వెళ్లిపోయినా, వాళ్లను పట్టుకుని, మా వాడు, మా జిల్లావాడని చెప్పుకోవటంలో ఆనందాన్ని పొందుతాం. సహజమేగా?

పియానో, గిటార్, దిల్రుబా, మాండొలిన్, ఎకార్డియన్, ఫ్లూట్, సెల్లో, వుడ్ ఫోన్, జలతరంగిణి, హేమండ్ ఆర్గన్ మొదలైన పది పదిహేను వాద్యాలు అలవోకగా వాయించగల సమర్థుడు వేణు. పాటల్లోని మాటలు, అందులోని ప్రతి అక్షరం, చక్కని జిలుగులతో రవ్వ జాతి పలుకులతో పాడించటంలో హార్మోనియమే ఆయనకు ఆధారం. ఈయన హార్మోనియం వాద్యం గమక శుద్ధంగా కనిపించడమే విశేషం. క్లారియొనెట్, వేణువు కలిపితే వెన్నముద్దలా మధురంగా ఉంటుందనే వారు. వాద్య ధర్మం తెలియటం వల్ల ఆయన పాటల్లో, నిండుతనం కనిపించి షడ్రసోపేతమైన భోజనం తిన్నంత హాయిగా ఉంటుంది.

ఏ గురువు సహాయం లేకుండా అద్వితీయంగా

హార్మోనియంపై పట్టు సాధించిన వేణు వాద్యం, చెన్నైలో 'గిరీస్ మ్యూజియం' నడిపే ఓ సంగీతాభిమాని, ఓ రోజు వేణు వాద్యం విని పరవశించిపోయి ఆ రోజుల్లో ప్రసిద్ధుడైన బిఎన్ఆర్ (భీమవరపు నరసింహారావు)కు పరిచయం చేయటంతో సంగీత రంగ ప్రవేశం చేశారు.

సంప్రదాయ సంగీత వాద్యాలతో చేసే వాద్య బృందంలోని మాధుర్యం తెలియాలంటే అలనాటి సంగీత దర్శకులైన ఎస్. ఎం.సుబ్బయ్య నాయుడు, సిఆర్ సుబ్బరామన్, పామర్తి, ఘంటసాల, పెండ్యాల, దక్షిణామూర్తి, రాజేశ్వరరావు, అశ్వత్థామ, కె.వి. మహదేవన్ వంటి వారి పాటల్ని పరిశీలిస్తే తెలుస్తుంది. పాతికేళ్ల క్రితం వేణుని విజయవాడ రేడియో కోసం ఇంటర్వ్యూ చేశాను. ఆ జ్ఞాపకాలింకా నా మనస్సులో వున్నాయి.

సంగీతం కంపోజ్ చేసే వారందరూ పాడలేరు. గాయకులందరూ పాటలను ట్యూన్ చేయలేరు. పాడగలిగే ప్రజ్ఞ కలిగిన సంగీత దర్శకుల పాటల్లో సహజత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆ రోజుల్లో బాగా పేరున్న వసంత్ దేశాయ్, నౌషద్, ఎస్.డి. బర్మన్ వంటి అగ్రశ్రేణి సంగీత దర్శకులతో బాగా సాన్నిహిత్యాన్ని పెంచుకున్న మాస్టర్ వేణు హెచ్ఎంవి రికార్డింగ్ కంపెనీలో, సంగీత దర్శకుడుగా కొన్నేళ్లు పని చేశారు.

ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన 'కుంతీకుమారి', 'పుష్పవిలాపం' జాషువాగారి పాపాయి పద్యాల రికార్డింగ్లో ప్రతి పద్యానికీ మధ్య.. మధ్య వాద్య బృందం సృష్టించినది వేణువాయే.

ఆ పద్యాలకు లభించిన ఖ్యాతి వల్ల స్వయంగా ఘంటసాల మాటతో వేణుని విజయా సంస్థకు ఆర్కెస్ట్రాకండక్టర్ గా తీసుకున్నారు. పివిపి రాజారాం అని ఆ రోజుల్లో విజయవాడలో ఒకే ఒక హార్మోనియం ప్లేయర్ వుండేవాడు. ఆయన తరచూ రికార్డింగులకు వస్తూ మాస్టర్ వేణు తనకు శిష్య వాత్సల్యంతో బహూకరించిన జర్మన్ హార్మోనియంని చూపిస్తూ మురిసిపోయేవాడు.

సింధుభైరవిలో 'రావోయి రావోయి రా చందమామ' అనే ఒక లలిత. గీతం, మిశ్రమోహన రాగంలో 'ఓహో! సుందరీ' అనే పాటలతో వున్న 78 ఆర్పిఎం రికార్డు మాత్రం విజయవాడ రేడియో కేంద్రంలో పదిలంగా ఉంది.

సహజమైన సంగీత వాద్యాల మాధుర్యానికి దూరమై పోయాం. తలుపు చెక్కల మీద బాదినట్లు డబ్బాల్లో గులకరాళ్లతో, కీచురాయి శబ్దాలతో చేసే వింతవింత ధ్వనులకు చెవులు అలవాటు పడిపోయి, సుస్వరం, సునాదాల జాడ కాస్తా ఆమడ దూరంలో ఉండిపోయింది. గ్రామఫోన్ రికార్డుల పుణ్యమా ని వినగలిగే సంస్కారం కలిగిన శ్రోతలింకా ఉన్నారు. ఎప్పుడు విన్నా నిత్య నూతనంగా భాసిల్లే ఆ పాటలు వింటున్నారు.

★ ★ ★

# తారకామృత సారాన్ని అందించిన వాగ్గేయకారులు
# గుజ్జుల నారాయణ దాసు



– ఆకొండి శ్రీనివాసరాజారావు
సెల్ : 9441238911

పవిత్ర గోదావరీ తీరంలో, తూర్పుగోదావరి జిల్లాలో, రాజమహేంద్ర వరానికి సమీపంలోని ఊరు ధవళేశ్వరం. ఎంతో ప్రాచీనమై, నవజనార్ధన క్షేత్రాలలో ఒకటై, ధవళగిరిపై నెలకొని ఉన్న జనార్ధన స్వామి ఆలయం ఈ ధవళేశ్వరంలో ఉంది. గోదావరిపై సర్ ఆర్థర్ కాటన్ ఆనకట్ట కట్టినది ఈ ధవళేశ్వరంలోనే. తన కీర్తనలతో, తత్త్వాలతో ఈ ఊరును ఆధ్యాత్మిక సౌరభంతో గుబాళింప చేసిన వాగ్గేయకారులు గుజ్జుల నారాయణ దాసు.



నారాయణదాసు రచించిన వేదాంతగ్రంథం తారకామృత సారము. ఈ గ్రంథాన్ని పరిశీలన చేయడం ద్వారా నారాయణ దాసు గురించి తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. ఈ గ్రంథం ఇంటర్ నెట్ ఆర్కీవ్ లో దొరుకుతోంది. అలాగే ఆన్ లైన్లో కొన్ని సైట్స్ ద్వారా ఈ పుస్తకాన్ని కొనే అవకాశమూ ఉంది.

ఈ తారకామృత సారము లో మూడు విభాగాలు ఉన్నాయి. మూడు భాగాలుగా గ్రంథకర్త విభజించలేదు కానీ స్థూలంగా పరిశీలిస్తే మూడు భాగాలని చెప్పవచ్చు.

మొదటి భాగం ప్రారంభంలో ఎనిమిది కందపద్యాలు ఉన్నాయి. వినాయకునిపైన, తమ ఇష్ట దేవతలపైన పద్యాలను రచించారు నారాయణ దాసు. అంతేకాకుండా తమ ఆధ్యాత్మిక గురువును గురించి ఒక పద్యంలో ఇలా వ్రాసారు.

కం. **దుష్ట గుణంబుల నెల్లను**
**అష్టమదంబులను బట్టి అణచెడి విధమున్**
**కష్టము లేకుండగ నీ**
**సృష్టిలో కనకయ్య గురుని చేత దొలంగెన్**

చెడ్డగుణాలను, ఎనిమిది రకాల గర్వాలను తొలగించే విధానం కనకయ్య గురువు వలన తెలిసిందని ఈ పద్యంలో నారాయణ దాసు చెప్పారు. దీనిని బట్టి నారాయణ దాసు గురువు కనకయ్య అని తెలుస్తోంది.

ఈ పద్యంలోనే కాకుండా ఆరభి రాగంలోని **'వెళ్ళిపోయేటప్పుడెంటా నెవ్వరు తోడురారు'** అనే తత్త్వంలో **'ధరణిలో కనకయ్య దాస గురునకు దాస నారాయణ జీవానీవు'** అంటూ తన గురువు కనకయ్యదాసు అని తెలిపారు. ఇంకా చాలా తత్త్వాలలో కూడా తన గురువు పేరును పేర్కొన్నారు.

కనకయ్య గొప్ప యోగ సాధకులు అని నారాయణదాసు తత్త్వం ద్వారా తెలుస్తుంది. **'ఏమి చెప్పుదు కాయపురపు శృంగారము'** అనే ఫరజురాగం, ఆటతాళంలోని తత్త్వంలో కనకయ్య గురించి ఆ విధంగా చెప్పారు

**ఏడుకోటలలో మూడేర్లు నడుమను**
**ఒంటిస్తంభమే ఒకటి ఉండేను**

**కనకయ్య ఎక్కి చూచి చూడు**

**నారాయణ దాసునికి.**

యోగసాధనకు సంబంధించిన విషయాలను తెలుపుతూ కనకయ్య యోగసాధకుడని నారాయణదాసు తెలిపారు.

ఈ విధంగా నారాయణదాసు గురువు కనకయ్యదాసు అని, ఆయన యోగసాధకులని మనకు తెలుస్తుంది.

మరొక పద్యంలో తమ వంశాన్నీ, తమ తల్లితండ్రుల పేర్లను పేర్కొన్నారు నారాయణ దాసు. ఆ పద్యాన్ని గమనించండి.

కం. **ధాత్రిలోపల శ్రీగంగా**

**గోత్రజులు సూరయాఖ్యునకు జనకునకున్**

**మాతము లక్ష్మీదేవికి**

**సూతుండను సూర్యవంశ సోముడను గురూ**

ఈ పద్యాన్ని బట్టి నారాయణదాసుది సూర్యవంశం అని, గంగా గోత్రం అని, వీరి తండ్రి సూరయ్య అని, తల్లి లక్ష్మీదేవి అని తెలుస్తుంది.

నారాయణదాసు ధవళేశ్వరంలో ఉండేవారనే విషయాన్ని పలు కీర్తనలలో పేర్కొన్నారు.

**'వాసిగాను ధవళేశ్వర పురమున నివాసమైన నారాయణదాసుని గాచిన హరి'** (గోవింద నీ నామము మరువను రా కీర్తన–ముఖారి–ఆది)

**ధవళగిరి పురమున నివాసమైయున్న నారాయణకవి** (స్వామిదయ రాదేమయ్యా కీర్తన శంకరాభరణం ఆటతాళం)

**ధరణిలోన ధవళగిరి పురము నందున కాపురముంటినిరా** (దేవరారా – కీర్తన – ఆదితాళం)

ధవళేశ్వరంలో వీరు కాటన్ పేటలో ఉండేవారనే విషయం కూడా వీరి కీర్తనల ద్వారా మనకు తెలుస్తుంది. **'రాం రాం రాం'** అనే నాదనామక్రియ రాగ కీర్తనలో వీరు ఈ విధంగా పేర్కొన్నారు.

**వాసిగాను ధవళేశ్వరపుర కాటన్ పేటలొ నేనుంటి**

**భాసురముగ నారాయణ దాసుని మోసము సేయకుమంటి**

మరి కొన్ని చోట్ల కూడా కాటన్ పేటలో నివసించిన విషయాన్ని దాసు పేర్కొన్నారు.

నారాయణదాసు జీవితకాలం ఎప్పుడనేది కొంత ఆలోచిద్దాం. వీరు కాటన్ పేటలో ఉండేవారని వారి కీర్తనల ద్వారా తెలుస్తోంది కదా! సర్ అర్థర్ కాటన్ ధవళేశ్వరంలో ఆనకట్టను 1847–1852 మధ్య కాలంలో నిర్మించారు. ఈ ఆనకట్ట నిర్మాణంలో పాలు పంచుకొన్న నిపుణులు, కార్మికులు, గోదావరికి సమీపంలో నివాసం ఉండేవారు. అనంతర కాలంలో ఈ ప్రాంతమే కాటన్ పేటగా ప్రఖ్యాతిగాంచింది. దీనిని బట్టి నారాయణ దాసు 1852 తరువాత వారని ఊహించవచ్చు. మరొక విషయం ఏమిటంటే దాసు రచించిన తారకామృతసారము తొలిసారిగా 1955లో ప్రచురితం అయ్యింది. ఈ గ్రంథం కాటన్ పేటకు చెందిన బోర అప్పల స్వామి ఉత్సాహం వలన ప్రచురితమయ్యిందని, ఆ పుస్తకంలో పేర్కొనబడి ఉంది. ఈ పుస్తకంలో దాసు వ్రాసిన ముందు మాట వంటిది ఏదీ లేదు. బహుశా దాసు అప్పటికి జీవించి లేరేమో. దీనిని బట్టి దాసు 19 వ శతాబ్దం చివరిలోను, 20 వ శతాబ్దపు ఆరంభంలోను జీవించి ఉంటారు అని భావించవచ్చు. కాకినాడలో నివసించిన ప్రఖ్యాత తత్త్వకర్త యడ్ల రామదాసు (1879–1929) కు నారాయణదాసు సమకాలికులు కావచ్చును. యడ్ల రామదాసు కూడా "సుజ్ఞాన చంద్రిక", "స్వస్వరూప జ్ఞాన సూర్యోదయము" అనే ఆధ్యాత్మిక గ్రంథాలను రచించారు. వీటిలో పద్యాలు, కీర్తనలు, తత్త్వాలతో పాటు, ఆధ్యాత్మిక విషయాలను వచనంలో వ్రాసారు యడ్ల

రామదాసు. తారకామృత సారము కూడా ఇదే విధంగా పద్యాలు, కీర్తనలు, తత్త్వాలు, ఇంకా వచన రూపంలో ఉన్న ఆధ్యాత్మిక విషయాలతో నిండి ఉంది.

మొదటి భాగంలో ఎనిమిది కందపద్యాలు తరువాత ఇరవైతొమ్మిది కీర్తనలు ఉన్నాయి. కీర్తనలు సరళమైన తెలుగులో ఉన్నాయి. అందరూ కలసి భజనలలో పాడుకొనేందుకు వీలుగా ఉన్నాయి. నారాయణ దాసు స్వనామాన్నే ముద్రగా ఉపయోగించారు. కీర్తనలలో ద్వితీయాక్షర ప్రాసనియమాన్ని తప్పక పాటించారు.

వినాయకునిపై యదుకుల కాంభోజి రాగంలో ఆటతాళంలో రచించిన ఈ కీర్తనను చూడండి.

**యదుకుల కాంభోజి – ఆట తాళం**

ప॥ **గణపతి గణపతి గణపతిని**
**అతి వినయముతో నేమ్రొక్కితిని.**

చ॥ **ముందు పూజనీకే గదా సురలు కిన్నెరలు జేతురుగద**
**చందన పరిమళ సుగంధము**
**వాసనలెల్ల మేనుకు అలంకరించిన ॥గణ॥**

చ॥ **వంకర తొండము వాడవురా**
**నా సంకటములు తెగగోయుమురా**
**శంకలేక నీ చెంత చేరితే**
**యమకింకరులకు నేవశముకానని ॥గణ॥**

చ॥ **ఎలుక వాహనారూఢుడవై**
**ఎల్లలోకములకు నీవు పూజ్యుడవై**
**నిలుకడతోడను ఇంట ఇంటను**
**కొలచినవారికి కోర్కెలొసగితివి ॥గణ॥**

చ॥ **గుజ్జువేల్పువని పొగడెదరు**
**గుజ్జుల నారాయణదాసుడను**
**మజ్జన భోజన పలహారములు**
**బొజ్జ నిండుగ భుజించిన వేల్పని ॥గణ॥**

రెండవ కీర్తన కాంభోజి రాగంలో ఆటతాళంలో సరస్వతీ మాతపై వ్రాసినది.

స॥ **జననీ జననీ జగజ్జాలములో నుంటి శారద గర్వాణి**

ఈ విధంగా పల్లవిని ఆరంభించారు. సరస్వతీ మాతనే నారాయణదాసు లలితా దేవిగా భావించారు. చరణంలో, **'ముగ్గురు మూర్తులగన్న ముక్తి కాంతవు నీవే'** అంటారు.

ఇదే కీర్తనలో ఒక చరణంలో, పిల్లల మాటలు విని తల్లులు ఎలా ఆనందిస్తారో అదేవిధంగా నామాటలు విని ఆనందించి నీ దయ వెదజల్లితే నా కర్మములు పండుటాకులవలె రాలిపోతాయి అని అంటారు.

**పిల్లలు పల్కిన పల్కులు తల్లులెట్లానందించిరో**
**అల్లనే జెప్పిన మాటలన్ని నీవట్లూ చల్లనీకృప**
**వెదజల్లుచు నుంటే చాలు తొల్లి చేసే కర్మములు**
**చెల్లును కారాకుల వలె**

దాసు; రామునిపై, ధవళగిరిపైనున్న జనార్ధనస్వామిపై, రంగనిపై, రాజరాజేశ్వర స్వామిపై, వెంకటేశ్వరునిపై మొదలైన దేవతలపై కీర్తనలు వ్రాసారు.

**'రామ రాఘవా రక్షించుదేవా రామ రాఘవా'** – అనే కీర్తన నాదనామక్రియ ఆదితాళంలో రచించారు. పల్లవిలో రాముని రక్షించమని కోరుతూ ఒక చరణంలో రామకథను వర్ణించారు. మరొక చరణంలో ప్రహ్లాద చరిత్ర, నరసింహావతారాన్ని, మరొక చరణంలో గజేంద్రమోక్షం ఘట్టాన్ని, మరొక చరణంలో కుచేలోపాఖ్యానాన్ని, చివరి చరణం మత్స్యావతారాన్ని వర్ణించారు. ఇలా రామా రక్షించు అని ఆరంభించి, విష్ణువు అవతారాలను వర్ణించడాన్ని గమనిస్తే, దాసు రాముడే మూలదైవం అని భావించినట్లుగా తోస్తుంది. కొన్ని కీర్తనలలో ఈ విధంగా పురాణాలలోని, ఇతిహాసాలలోని ఘట్టాలు గోచరిస్తున్నాయి.

దాసు కొన్ని కీర్తనలలో తనను పసివాడుగా, కసుగాయగా వర్ణించుకొన్నారు.

**'పసివాడను నే కసుగాయ సమమౌను'**

**(రామా రాఘవ చూపువేమిరత్రోవ – ఫరజు – ఆది)**

పరమాత్మ అంతటా నిండి ఉంటాడు అనే విషయాన్ని పామరులకు కూడా తెలిసే విధంగా ఎలా చెప్పారో చూడండి.

**నాదనామక్రియ – అట**

ప॥ **నీలకంఠ నిండి నావురా పృథ్వియందు**

**సందులేక ఇమిడి దాగినావురా**

దాసుకొన్ని కీర్తనలలో మాయ నుంచి తనను తప్పించమని ఇలా వేడుకొన్నారు.

**'భక్తజనులను బ్రోచే దేవా మాయాశక్తిని విడదీయలేవా'** (నారాయణ వాసుదేవ కీర్తన–కాంభోజి – ఆది)

**చక్కని ప్రపంచమున మిక్కుటమైనట్టి మాయ**
**ఎక్కువ చిక్కులు బెట్టుచున్న దేవేళా**
**మక్కువ తోడుత నీదు ఏక చక్రముతో**
**మాయా శక్తిని దాటించుటకు దిక్కు నీవేయంటి దేవా**

(స్వామి నామొరాలించి బ్రోవరా – ఖమాస్–అటతాళం)

మరొక కీర్తనలలో జనులకు ఏవిధంగా బోధ చేసారో చూడండి.

**నాదనామక్రియ – అట**

ప: **నరులార శ్రీహరిని నమ్మియుండండి.**
**నరకములో బడి నలిగి పోకండి ॥ నమ॥**

చ॥ **భక్తి చేతను ముక్తి మార్గము వెతకండి**
**యుక్తి చేతను మాయా శక్తి దాటండి ॥ నరు॥**

చ॥ **సుజనులతో కూడి సుఖము జెందండి**
**భజన ఎప్పుడు భావమందు జేయండి ॥నరు॥**

చ॥ **వాద భేదములన్ని వదలి పెట్టండి**
**మేదినిలో దామోదరుని వేడండి ॥నరు॥**

చ॥ **ఎన్నాళ్ళు బ్రతికినా సున్నా సుమండీ**
**కొన్నాళ్ళు దేముని కోరివేడండి ॥నరు॥**

చ॥ **తల్లి తండ్రియు గురు దైవమనండి**
**చిల్లర గుణము చేయబోకండి ॥నరు॥**

ఈ కీర్తనలో దాసు ముద్రలేదు.

ఈ ఇవది తొమ్మిది కీర్తనలకు దాసు; యదుకుల కాంభోజి, ఫరజు, నాదనామక్రియ, హిందుస్తానీ కాపి, తోడి, ముఖారి, మణిరంగు, సావేరి, శంకరాభరణం, మోహన, శ్రీరాగం, ఖమాస్ వంటి రాగాలను ఉపయోగించారు. ఆది, రూపకం, అట, చాపు వంటి తాళాలలో ఈ కీర్తనల రచన చేసారు. రెండు కీర్తనలకు రాగాలను పేర్కొనలేదు.

మొదటిభాగం చివరగల మంగళంలో మన దేహంలో గల వివిధ చక్రాలు, వాటి అధిష్టాన దేవతలు ఉన్నాయి. ఈ మంగళంకు రాగం, తాళం వివరాలు లేవు. ఈ మంగళంను గమనించండి.

ప॥ **శ్రీరఘురాజ హరే హారతినీకు ॥శ్రీ॥**

చ॥ **అందముగ ఆధార పద్మమున**
**ముందు గణపతికి ఆరువందలు ॥శ్రీ॥**

చ॥ **సొగసుగాను స్వాధిష్ట పద్మమున**
**అగణితముగ బ్రహ్మకు ఆర్వేలు ॥శ్రీ॥**

చ॥ **మరి మణిపూరక పద్మమందున**
**మెరయుచున్న విష్ణువు కార్వేలు ॥శ్రీ॥**

చ॥ **సుందరముగ అనాహత పద్మమున**
**పొందుగాను రుద్రున కార్వేలు ॥శ్రీ॥**

చ॥ **వినయముతో విశుద్ధ పద్మమున**
**ఘన జీవాత్మునకు ఒక వేయి ॥శ్రీ॥**

చ॥ **భ్రూమధ్యమున ఆగ్నేయ పద్మమున**
**పరమాత్మునకు వేయి ॥ శ్రీ॥**

చ॥ **దండిగాను సహస్రార పద్మమున**
**నిండి యున్న గురునకు ఒక వెయ్యి ॥శ్రీ॥**

చ॥ **హారతులిచ్చె నారాయణ దాసు**
**ఇరువది ఒక వెయ్యారు వందలు ॥శ్రీ॥**

ఈ విధంగా ఈ మంగళ హారతిలో మన దేహంలోని చక్రాలను, ఆచక్రాలకు అధిష్ఠాన దేవతలను పేర్కొని, వాటికి ఎన్నిసార్లు హారతులు ఇస్తారో తెలిపారు. అన్ని చక్రాలను ఇచ్చిన హారతులు మొత్తం 21,600 సార్లు అయ్యింది. చివరి చరణంలో నారాయణ దాసు ఈ మొత్తం హారతులను ఇచ్చానని తెలియ జేసారు. ఇటువంటి కీర్తన యద్ల రామదాసుకూడా రచించారు. ఒకొక్క చక్రానికి ఒక లెక్క చొప్పున హారతులు ఇవ్వడం అంటే ఆయా చక్రాలలో జరిగే శ్వాస అన్నమాట. మానవుడు 21,600 సార్లు రోజుకు శ్వాసిస్తాడని యోగశాస్త్రం చెబుతుంది. ఆయాచక్రాలలో జరిగే శ్వాసల మొత్తం 21,600 అవుతుంది. చక్రాలలో జరిగే శ్వాసలనే నారాయణ దాసు హారతులుగా పేర్కొనడం జరిగింది అని నా భావన.

నారాయణదాసు గొప్ప యోగసాధకులు. ముందు ఉదహరించిన మంగళహారతి లోనే కాకుండా పలు తత్త్వాలలో కూడా యోగ సాధనకు సంబంధించిన విషయాలు పేర్కొన్నారు.

ఇంతవరకు మనం తారకామృతసారం లో ప్రథమ భాగం గురించి తెలుసుకొన్నాం. ఇప్పుడు ద్వితీయ భాగాన్ని పరిశీలిద్దాం.

రెండవ భాగం ప్రారంభంలో పదకొండు పద్యాలు ఉన్నాయి. ముందు వినాయకుని నుతిస్తూ పద్యం వ్రాసారు.

క॥ **అందముగ నాధారంబున**
**పొందుగ దళములు నాల్గు వ,శ,స,ష లుండున్**
**ముందుగ గణనాథునికి**
**వందనములు జేతు ఆరు వందలు నెప్పుడున్**

మూలాధారంకు నాలుగు దళాలు ఉంటాయి. ఒకొక్క దళంపైన వ, శ, స, ష అనే అక్షరాలుంటాయి. మూలాధారానికి అధిపతి గణపతి. ఆరువందల వందనాలు చేస్తాను అంటే మూలాధారంలో జరిగే శ్వాసను గురించి చెప్పారు. లేదా చేయవలసిన జపం గురించి చెప్పిఉండవచ్చు.

మరొక పద్యంలో జ్ఞానం పొందడానికి మానవ జన్మ కాక వేరొకటి లేదని చెబుతూ, వేరేమతములలో పడి నరులు బ్రహ్మను తెలియక పశువులు అవుతున్నారని అన్నారు.

క॥ **జ్ఞానానందము గనుటకు**
**మానవ జన్మంబె గాని మరియొకటుందా?**
**నానా మతములలో బడి**
**గానక బ్రహ్మంబు నరులు పశులయ్యెదరూ**

ఇంకొక పద్యం చూడండి.

సీ॥ **తీర్థయాత్రలెన్ని తిరిగి సేవించిన**
**ప్రారబ్దకర్మముల్ బాసిపోవు**
**ముందు జేసిన కర్మమనుభవించకగాని**
**యమ ధర్మ రాజు వధింపలేడు**
**పుట్టినప్పటి నుండి భక్తి జేసితెగాని**
**ఆగామి సంచిత మడగ బోదు**
**జ్ఞానుల వద్ద యుపదేశ మొందితెగాని**
**మానవ జన్మమునకు ముక్తిలేదు**

**గనుక పంచేంద్రియంబులు గట్టి పరచి**
**అనలమందున దుర్గుణాలన్ని ద్రోచి**
**ఘనమున గంగగోత్రమందుద్భవించి**
**వినయముగ కృతి రచించె వేడుకలరా**

ఎన్ని తీర్థయాత్రలు చేసినా గతజన్మలో చేసిన కర్మలు పోవని, మనం భూమిపై అనుభవించాల్సినంతా అనుభవిస్తేకాని చావు రాదని, జ్ఞానుల వద్ద ఉపదేశం పొందితేగాని ముక్తి లేదని కనుక పంచేంద్రియాలను అదుపులో ఉంచుకొని, దుర్గుణాలన్నీ అగ్నిలోవేసి, గంగగోత్రమున పుట్టి కృతిని రచించానని ఈ పద్యంలో నారాయణదాసు చెప్పుకొన్నారు.

ఈ పద్యాల తరువాత ఈ రెండవ భాగంలో తత్త్వాలు, ఆత్మరామాయణం, మేలుకొలుపులు, లాలిపాట, కందార్ద దరువులు ఉన్నాయి. ముందుభాగంలో కీర్తనలు, రెండవ భాగంలోని సంగీత రచనలు కలిపి మొత్తం తొంభైఐదు ఉన్నాయి.

ఈ రెండవ భాగంలోని కొన్ని తత్త్వాలలో పీర్ మొహ్మద్ అనే పేరు కనిపిస్తోంది. ఆ తత్త్వాల వివరాలు చూద్దాం.

1) **పూజించు చెలులారా – ఫరజు – అట తాళం**

2) **తారకము సూటెరుగవలెనన్న – నాదనామక్రియ – అపతాళం**

3) **వాడేరా గురురాయని పుత్రుడు – ధన్యాసి – ఆది**

4) **ఎరగరయ్యా బ్రహ్మం బెరుగరయ్యా – కాంభోజి – అట**

5) **మాయ బొమ్మనీ సద్గురు రాయుడు – మోహన – ఆది**

6) **లేదు లేదు సుమీ ఇందునా మోక్షము – నాదనామక్రియ – ఆది**

ఈ తత్త్వాలు కొన్నింటిలో నారాయణదాసు ముద్ర లేకుండా కేవలం పీర్ మొహిద్దీన్ పేరు కనిపిస్తోంది. అవి పీర్ మొహిద్దీన్ రచనలా? లేక నారాయణ దాసు రచించి, మొహిద్దీన్ పేరు ఉంచారా? రచనా రీతిని బట్టి ఇవి నారాయణ దాసు రచనలేనని పీర్ మొహిద్దీన్ పేరు ఉంచారు అని తోస్తోంది. అయితే ఈ పీర్ మొహిద్దీన్ ఎవరు? పీర్ లు అంటే సూఫీ సంప్రదాయానికి చెందిన ఆధ్యాత్మిక గురువులు. వీరు హిందూ ముస్లిం సాంస్కృతిక సామరస్యానికి తోడ్పడ్డారు.

ఈ పీర్ మొహిద్దీన్ కూడా నారాయణదాసుకు గురువు అయి ఉండవచ్చు. నారాయణ దాసు గురువు కనకయ్య అని ముందు తెలుసుకొన్నాం కదా! పీర్ మొహిద్దీన్ కూడా నారాయణ దాసుకు కొంత ఆధ్యాత్మిక సహాయం చేసి ఉండవచ్చు.

**'ధరను పీర్ మొహిద్దీను కృపచే నెరిగి నారాయణదాసుడు ఇరువదొక వేలారు మార్లును దినదినము తారకము చదువుచు'** (పూజించు చెలులార – రాగం – ఫరజు అట తాళం) అని నారాయణ దాసు అనడం బట్టి ఆ తారక మంత్రాన్ని పీర్ మొహిద్దీన్ నారాయణదాసుకు ఇచ్చి ఉండవచ్చునేమో.

**'శ్రీరామా యనుమా జీవమా'** అనే నాదనామక్రియ రాగం, ఏకతాళంలోని తత్త్వంలో – **'పీర్ మొహిద్దీన్ కు సలాం కర్ జావే'** అంటూ వ్రాసారు నారాయణ దాసు. దీనిని బట్టి పీర్ మొహిద్దీన్ దాసుకు పూజనీయుడని మనకు అర్థం అవుతుంది.

1955లో ప్రచురితం అయిన తారకామృతసారములో నారాయణదాసు, పీర్ మొహిద్దీన్ సాహెబ్, బోర అప్పలస్వామిల చిత్రం ఉంది. నారాయణదాసు తంబూరా మీటుతూ పాడుతున్నట్లుగాను, బోర అప్పలస్వామి తాళం వేస్తున్నట్లు వీరితో కూడా పీర్ మొహిద్దీన్ ఉన్నట్లుగా ఈ చిత్రంలో ఉంది. బోర అప్పలస్వామి, నారాయణ దాసు ఇద్దరూ మిత్రులు పీర్ మొహిద్దీన్ లు శిష్యులు అయి ఉండవచ్చు. బోర అప్పలస్వామి కాటన్ పేట వాస్తవ్యులు బోర సింగన్నదాసు పుత్రులు. తారకమృత సారం ప్రచురణ వీరివలన జరిగిందని ముందు తెలుసుకొన్నాం. ప్రస్తుతం దొరుకుతున్న తారకామృతసారము పుస్తకాన్ని సి.వి.

కృష్ణాబుక్ డిపో మద్రాసు వారు ముద్రించారు. దీని అట్టపైన నారాయణదాసు, పీర్ మొహిద్దీన్, బోర్ అప్పలస్వామిల చిత్రం ఉంది.

**'లేదు సుమీ యిందున మోక్షము'** అనే నాదనామక్రియ రాగ తత్త్వంలో కేవలం భక్తిని బాహ్యంగా ప్రదర్శించితే మోక్షం కలుగదు అంటారు.

**'నీళ్ళలో మునిగిన పక్షివలెను**
**ఉదయం స్నానంబులు చేసినగాని**

**తెల్ల గుమ్మడి పండువలె**
**దేహమునకు భస్మం పూసినగాని**

**పండిన వెదురాకువలె గోపిచందన**
**మలంకరించినగాని**

**అడవిలో మేసే పశువువలె**
**కందమూలములు తిన్నగాని**

**మర్రి వూడ వలె తన వెంట్రుకలు**
**జడదాల్చి శిఖ వేసిన గాని'**

**'లేదు సుమా యిందున మోక్షము'** అంటారు. ఈ కీర్తనలో నారాయణ దాసు ముద్రలేదు. పీర్ మొహిద్దీన్ పేరు కనిపిస్తోంది.

**'ధరణిలోన పీర్ మొహిద్దీన్ మాటలు వినక వైరాగ్యమున యుంటెను గానీ లేదుసుమీ మోక్షము'**

నారాయణ దాసు తత్త్వాలలోను, కీర్తనల లోను ఎన్నెన్నో యోగ సాధనకు సంబంధించిన విషయాలు కనిపిస్తున్నాయి. మొదటి భాగం చివరన గల మంగళంలో షట్ చక్రాల వివరాలున్నాయని ముందు తెలుసుకొన్నాంగదా! అలాగే రెండవ భాగంలో కూడా ఒక మంగళహారతిలో షట్చక్రాలు, వాటికి గల దళాలు, ప్రతీ దళం పైన గల అక్షరాలు, ఆచక్రానికి అధిష్టాన దేవతలు, అందులో జరిగే శ్వాసలు ఈ వివరాలు కనిపిస్తున్నాయి. ఇది యదుకుల కాంభోజి రాగంలో ఆటతాళంలో ఉంది.

ప॥ **హారతివ్వరే మంగళహారతివ్వరే**
**వైకుంఠ వాసునకి హారతివ్వరే**

చ॥ **ఆసన స్థానంబునం ఆధారపద్మమున**
**నాల్గు దళములు వశషస లుండు**
**శాకిని శక్తి గణపతిని కారువందలు**

చ॥ **లింగస్థానమందు స్వాధిష్టాన పద్మమున**
**కారు దళములు బభమయర వలుండు**
**దానికి బ్రహ్మకు ఆరువేలు**

ఈ మంగళ హారతి ఈ రీతిలో సాగుతుంది.

ఇంకా చాలా తత్తవాలలో యోగసాధనకు సంబంధించిన విషయాలను పొందుపరచారు నారాయణ దాసు. చాలా మంది తత్త్వకర్తలు కూడా ఇదే విధంగా యోగసాధనకు సంబంధించిన విషయాలను తమ రచనలో నిక్షిప్తం చేయడం మనకు కనిపిస్తుంది.

పరమాత్మకు మేలుకొలుపులను చాలామంది వాగ్గేయకారులు వ్రాసారు. నారాయణ దాసు జీవునికి మేలుకొలుపు వ్రాసారు. అజ్ఞానం నుండి మేలుకొని మోక్షంకోసం ప్రయత్నించమని, యోగసాధన చేయమని హితవు చెబుతూ ఈ మేలు కొలుపును రచించారు.

**భూపాళ – ఆది**

స॥ **మేలుకొనవే మేలుకొనవే మేదిని లోపలను నీవు**
**కాలయముని బాధ కోర్వగలేవు మేల్కొనవే ॥మేలు॥**

చ॥ **పాపమైనను పుణ్యమైనను**
**నీకు తప్పదు ధాత వ్రాసెను**
**కోప పడకుమి చెప్పితిని త్వరితముగ మేలుకొనవే**
**॥మేలు॥**

చ॥ **చీము నెత్తురు యున్న కొంపలో**
**చిక్కుపడి మెలగుచుంటివి**
**సోమ సూర్యులనడుమ చోద్యము**
**గలదు మేలుకొనవే ॥మేలు॥**

ఈ మేలుకొలుపు ఈ రీతిలో సాగుతుంది.

**'జీవులెనుబది నాలుగు లక్షలు చావు పుట్టుక లిక్కడా'** – **'ఎవరు చేసిన వారి కర్మలమలనుభవించేదక్కడా'** అనే తత్త్వం శుద్ధ సావేరి రాగంలోనిది. నారాయణదాసు రచించిన ఈ తత్త్వం ప్రముఖ గాత్ర విద్వాంసులు, వాగ్గేయకారులు ఎమ్.ఎస్. బాలసుబ్రహ్మణ్య శర్మ గారికి ప్రేరణను ఇచ్చింది. శర్మగారు ఇదేపల్లవితో ఒక తత్త్వాన్ని రచించారు. చరణాలు మాత్రంవేరు.

ఆధ్యాత్మిక విషయాలను గురు శిష్య సంవాదం రూపంలో తెలియపరిస్తూ రచించిన ఈ తత్త్వాన్ని గమనించండి.

**నాదనామక్రియ–అట**

స॥ **రాజయోగము రమ్యమందురు**
**బోధ తెల్పుడు గురువరా**
**తేజమైనది రామనామము**
**రాజమార్గము శిష్యుడా ॥రాజ॥**

చ॥ **మార్గమెరుగక మాయలోబడి**
**మరచితిని సద్గురువరా**
**స్వర్గలోకము జేరెదవు వర్గములు**
**నరికితె శిష్యుడా ॥రాజ॥**

చ॥ **నరికెదను వర్గముల మర్మము**
**మరుగు తెలియదు గురువరా**
**కామక్రోధ లోభ మోహ**
**మదములు శిష్యుడా ॥రాజ॥**

చ॥ **మద గజంబులు యెనిమిదందురు**
**విధము తెలియదు గురువరా**
**చదువు యవ్వన రూప**
**కులధనమదములందురు శిష్యుడా ॥రాజ॥**

ఈ విధంగా ఈ తత్త్వం సాగుతుంది.

చాలా మంది వాగ్గేయకారుల రచనలలో అంకెలను ఉపయోగించి ఆధ్యాత్మిక విషయాలను చెప్పడం కనిపిస్తుంది. తూము నరసింహదాసు, యోగి నారాయణ యతీంద్రుల కీర్తనలలో ఇటువంటివి ఉన్నాయి. అలాగే గుజ్జుల నారాయణదాసు తత్త్వాలలో అంకెలను ఉపయోగించి విషయాన్ని చెప్పడం కనిపిస్తుంది. **'శ్రీహరినారాయణ అమృతసారం'** అనే తత్త్వం చరణంలో –

**'మనంబున మూడు విడువరన్నా'**

**ఆరునెగరేసి నరుకుమన్నా'** అన్నారు. ఇక్కడ మూడు అంటే సత్త్వ, రజః, తమోగుణాలు. వీటిని విడిచిపెట్టాలి. అలాగే ఆరింటిని అంటే కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలు వీటిని నరకాలి. అంటే వాటిని కూడా మనం విడచి పెట్టాలి.

అదేవిధంగా ఆరభి రాగంలో **'వెళ్ళిపోయేటప్పుడెంటా నెవ్వరు తోడు రారూ'** అనే తత్త్వంలో

**ఆరునిధులపైన ఏక భావముగాను**

**ఆడి పాడుచు నుండరా జీవా నీవు**

అంటారు. ఆరునిధులు అంటే షట్ చక్రాల పై సమభావంతో ఉండి అంతర ఆనందాన్ని అనుభవించాలి.

**'సత్యమే బ్రహ్మం అసత్యమే కాయం మాయం'** అనే తోడి రాగం రూపక తాళంలోని తత్త్వంలో

**'శత్రు లార్గురితో నెప్పుడు చెలిమి చేసి**

**చెడి పొయ్యేవే మనసా**

ఇక్కడ ఆరుగురు శత్రువులంటే కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలన్నది స్పష్టం.

ఈ విధంగా పలు తత్త్వాలలో అంకెలతో విషయాన్ని చెప్పడం కనిపిస్తుంది.

చాలా మంది తత్త్వకర్తలు అంతరార్థంతో గల తత్త్వాలను రచించారు. కొన్ని తత్త్వాలలో చాలా సులువైన, అందరికీ తెలుసున్న పదాలు ఉంటాయి. పైకి అర్థం అయినట్టే ఉంటాయి. కాని వాటియెక్క అంతరార్థం వేరే ఉంటుంది. ఇటువంటి అంతరార్థం గల తత్త్వం నారాయణ దాసు రచనలలోనూ ఉంది. ఆ తత్త్వం చూద్దాం.

**నాదనామక్రియ – అట**

ప॥ **భజన ఎట్టిదొ తెలియరా**
**నిజము గనుగొని నడవర**
**అజుడువ్రాసిన వ్రాత కొలదిగ**
**సజ్జనులకు నిది చిక్కుర ॥భజ॥**

పరమాత్మని భజన చేయడం ఎలాగో తెలుసుకొని, మనం నడచుకోవాలి. బ్రహ్మమనకు వ్రాస్తేనే, భగవదను భూతి దొరుకుతుంది.

చ॥ **పంచభూతములైదురా**
**ప్రపంచ రూపములాయెరా**
**కొంచ పరచక నీవు ఈ**
**పంచాక్షరిని పఠియించరా**

పంచభూతములతో ఈ ప్రపంచం ఏర్పడింది. పంచాక్షరి మంత్రజపం చేస్తే ఈ ప్రపంచం అశాశ్వతం అనే అనుభవాన్ని పొందగలం.

**ఇంటిలోపల పోరురా**
**కలి కంటి కనబడదేమిరా**
**వెంటనున్న దొంగలార్గురు**
**మంటలో పడి మండెరా**

ఇంటిలోనికి వెళ్ళి చూడాలి ఇల్లు అంటే మన శరీరం. మన శరీరంలోనికి వెళ్ళి వెతకాలి. అప్పుడు ఈ శరీరం నేను కాదు అనే జ్ఞానం కలుగుతుంది. ఈ జానాగ్నిలో వెంటనున్న ఆరుగురు దొంగలు మండి పోతారు. ఈ ఆరుగురు దొంగలు కామ, క్రోధ లోభ, మద, మాత్సర్యాలు

చ॥ **ధృడముగను గమనించి జాడగనుగొని చూడరా**
**ఏడుమేడల పైకి ఎక్కి ఆడుతున్నది ఎరుగరా**

స్థిరమైన మనస్సుతో ధ్యానించి, మనలోని కుండలినీ శక్తిని తెలుసుకొని ఆ శక్తి ఏడు చక్రాలలో తిరిగేవిధానం తెలుసుకో అంటే యోగ సాధన ద్వారా కుండలీ శక్తిని మేలుకొలిపి, నీలోని చక్రాలలో, ఆశక్తి ప్రయాణించేలా చేయి.

చ॥ **గంగ యమునల నడుమరా సంగమున్నది చూడరా**
**సంగములో స్నానము జేసితే లింగరూపము నీవెరా**

గంగ, యమున అనేవి మనలోగల ఇడా, పింగళనాడులు. వీటి మధ్య నగల సుషుమ్న నాడి మార్గమే సంగమం. మనం యోగ సాధన ద్వారా ప్రాణశక్తిని సుషుమ్న నాడి ద్వారా వివిధ చక్రాల ద్వారా పైకి తేవాలి. అలా ఆ చైతన్యాన్ని అనుభవించితే నేనే శివుడవు అనే అనుభవాన్ని పొందుతావు.

చ॥ **నక్క ఒక్కటియుండె రా కుక్కల ఎగదోలెరా**
**చిక్కులేకను చీమ మకరిని నిక్కముగ దిగ మింగెరా**

ఇక్కడ నక్క అంటే మనలోని అంతః శక్తి. కుక్కలు అంటే మన ఇంద్రియాలు. ఇవి విషయాల వెంట పరిగెత్తుతాయి. ఈ ఇంద్రియాలను అంతఃశక్తి వెనుకను మళ్ళిస్తుంది. చీమ అంటే మనలో సూక్ష్మమైన చైతన్యశక్తి. ఈ శక్తి బలమైన మాయా శక్తిని జయించడమ చీమ మకరిని మింగడం.

చ॥ **గొప్పపాములు ఐదురా**
**కప్ప వాటిని చూచెరా**

**చప్పుడేమియు చేయకుండగ**
**నిప్పులోబడి చచ్చెరా**

గొప్పపాములు అంటే మనిషిలోని పంచేంద్రియాలు. ఇవి విషయాల వైపు వెళ్ళేపాముల వంటివి. కప్ప అంటే సాధకునిలోని చైతన్యంలేక మనస్సు కు సంకేతం. ఈ చైత్యం ఇంద్రియాలను గమనించే సాక్షి. చప్పుడేమియు చేయకుండగ అంటే ఇంద్రియాలను అణచివేయడమే కాక మనస్సును నిశ్చలంగా, మౌనంగా ఉంచడం. నిప్పులో బడి చచ్చెరా అంటే జ్ఞానాన్ని లేదా యోగాగ్నిలో ఇంద్రియాల విషయాసక్తి, అహంకారం, అజ్ఞానం దహించబడడం.

చ॥ **ఈగ ఒక్కటి చూచె రా**
**వేగ మంచము మింగురా**
**జాగు సేయక మర్కటములు**
**రోగములు తెగగోసెరా**

ఈగ అంటే మనలో కలిగిన ఆధ్యాత్మిక వికాసం కావచ్చు. ఈ ఆధాత్మిక వికాసం మంచాన్ని మింగింది అంటే మంచం అన్నది ఇహసుఖాలకు ప్రతీక అనుకొంటే ఆ ఆధ్యాత్మిక వికాసం వలన ఇహ సుఖాలపై ఆసక్తి నశించింది అనుకోవచ్చు. ఈ ఆధ్యాత్మిక వికాసం వలన మర్కటముల వంటి అంతఃకరణలు రోగాలను అంటే కామాదులను తెగగోసాయి. అంటే కామాది దుర్గుణాలు తొలగిపోయాయి అని భావించవచ్చు.

ఈ అంతరార్థం గల తత్త్వాన్ని నా అవగాహన మేరకు వివరించాను.

ఈ తత్త్వాలకు నారాయణదాసు; ఆరభి, ఫరజు, నాదనామక్రియ, కాంభోజి, రేగుప్తి, శుద్ధసావేరి, ముఖారి, ధన్యాసి, సురటి, పున్నాగవరాళి, యదుకులకాంభోజి, శ్రీరాగం, తోడి, ఆనందభైరవి, పంతువరాళి, హిందుస్థానీ కాపీ, శంకరాభరణం, భూపాల రాగాలను ఉపయోగించారు. ఆది, అట, చాపు వంటి తాళాలను ఉపయోగించారు.

వీరి తత్త్వాల, కీర్తనల సాహిత్యం మాత్రమే మనకు దొరికింది. వాటిని ఎలా పాడేవారో తెలియదు. ఎక్కడైనా భజన బృందాల వారు పాడుతుంటే వీటి వరుసలు తెలిసే అవకాశం ఉంది.

వీరి తత్త్వాలపైన, కీర్తనల పైన ఇంకా లోతుగా పరిశీలన, పరిశోధన చేస్తే ఎన్నో విషయాలు వెలికి వచ్చే అవకాశం ఉంది. సంగీత పరిశోధకులు వీరిపై పరిశోధన చేయవచ్చు.

ఈ వ్యాసకర్త 2022 లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాగ్గేయకారుల పై ఒక గ్రంథాన్ని వెలువరించాడు. అయితే అప్పుడు నారాయణ దాసు గురించి తెలియకపోవడం వల్ల ఆ గ్రంథంలో పొందుపరచడం జరగలేదు. కనుక వారి పై ఈ వ్యాసాన్ని వెలువరించడం జరిగింది.

ఇంక మూడవ విభాగంలో పలు ఆధ్యాత్మిక విషయాలను వచనరూపంలో దాసు వివరించారు. మనుష్యమృగాది సంఖ్య నిర్ణయం, మనుష్యప్రమాణం, సప్తవ్యసనములు, ఇరువదియైది తత్త్వములు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, దశవిధనాదులు, ఉపవాయువులు, అష్టమదాలు, షడ్మార్గులు, షడ్భావనలు, మంత్రయోగం, తారక యోగలక్షణము, అమనస్కయోగ లక్షణం, షడాధారముల స్థాన హంసంబుల వివరణ, రాగద్వేషాలు, రేచక, పూరక, కుంభకాదుల వివరణ, అష్టాంగయోగంబుల వివరణ మొదలైన ఎన్నో ఆధ్యాత్మిక విషయాల వివరణ ఈ మూడవ భాగంలో ఉంది. ఈ వివరణలు దాసుకు ఆధ్యాత్మికతపై, యోగ సాధనలపై గల సాధికారతను తెలుపుతున్నాయి.

నారాయణదాసు కీర్తనలకు, తత్త్వాలకు స్వరం కూర్చి విద్యాంసులు ప్రచారంలోకి తేవాల్సిన అవసరం ఎంతో ఉంది.

★ ★ ★

# "కర్ణాటక సంగీతం లో తెలుగుభాష పాత్ర అవినాభావ సంబంధం"



ఎస్.గిరిజాశంకర్
81218 84461

భారతీయ సంగీత చరిత్రలో కర్ణాటక సంగీతం విశిష్టమైన స్థానాన్ని అలంకరించి, కాలగమనంలో తనదయిన వైభవాన్ని సంతరించుకున్నది. ఈ దక్షిణ భారత సంగీత సంప్రదాయ వికాసంలో కన్నడ, తమిళ, మలయాళ భాషలు తమవంతు పాత్రను పోషించినప్పటికీ, సంస్కృతాంధ్ర భాషలు తమదైన ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నాయి. అందునా తెలుగు భాషకు లభించిన గౌరవం అత్యున్నతమైనది. కర్ణాటక సంగీతంలో గేయ లేక గాన సాహిత్యములో అత్యధిక వాగ్గేయకారుల రచనలు తెలుగులోనే చేయబడినవి కనుక, తెలుగుభాష కర్ణాటకసంగీతానికి మాతృభాష గా పరిగణించ బడుచున్నది అనుటలో అతిశయోక్తి లేదు.

కర్ణాటక సంగీత సంప్రదాయ, స్వరూప స్వభావములకు ప్రాణప్రదమైనది,జీవగర్ర అయినది తెలుగు భాష అని స్పష్టముగా తెలియుచున్నది. సంగీత త్రిమూర్తులలో, త్యాగయ్య, శ్యామశాస్త్రి గారలు వారి రచనలకు తెలుగునే ప్రధాన వాహికగా స్వీకరించిరి. తంజపురి తమిళనాడు లోనిది ఐనప్పటికి, అప్పటి అచ్చటి సంగీత సభలయందు ప్రతిధ్వనించిన భాష (సింహభాగం) తెలుగు కావడం ఒకచారిత్రక విశేషం. తెలుగు తరువాత శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు సంస్కృతము నందు రచనలు చేసినప్పటికి వారి సంస్కృతభాష సరళగంభీరమైన సరళిలో, మృదుగిరమై,

గ్రాంధిక తెలుగు భాషను పోలియుండును. అదేవిధముగా శ్రీ త్యాగయ్య గారి రచనలయందు అనేక సరళ సంస్కృతపదములు దర్శనమిచ్చును. యిది సంస్కృతాంధ్రముల మధ్యనున్న అవినాభావ సంబంధము. సంస్కృతాంధ్రముల కలయిక పాలు తేనెలవలె సుమధుర సంగమము. అన్నమయ్య, రామదాసుల వారిది అచ్చ తెలుగు నుడికారము.

స్వరమునకు సహజ సహచారిణియై, గమకమునకు, గాత్ర రమణీయతకు మాధుర్యగుణ సంపన్నతనిచ్చునది తెలుగు. అచ్చులప్రాబల్యము, మృదులమైన ధ్వని, భావ వ్యక్తీకరణ సామర్థ్యము .... ఈ సుగుణ సంపదయే కర్ణాటక సంగీత కృతి సాహిత్యానికి తెలుగుభాషను అపురూపమైన, అపూర్వమైన సాధనముగా నిలిపినది.

కర్ణాటక సంగీతం ఒక మహావృక్షం అనుకుంటే దానియొక్క వేర్లు, శాఖల యందు ప్రవహించే జీవరసము తెలుగు భాష . తత్ఫలితముగానే మధుర ఫలముల వంటి గీతికా వైభవం మనకుసొంతమైనది. కర్ణాటక సంగీతమునకు తెలుగు సాహిత్యం శరీరమైతే రాగమేప్రాణం,లయ గుండె చప్పుడు. యుగములు మారినను, కర్ణాటక

సంగీత స్వరూపం పరివర్తితమైనను, కర్ణాటక సంగీత స్రవంతి నుండి తెలుగును వేరు చేయడం గంగానది నుండి హిమాలయములను వేరుచేయు ప్రయత్నమే, కనుక తెలుగుభాష యొక్క వైభవమును ప్రపంచమునకు చాటిన మహత్తర వేదిక కర్ణాటకసంగీతం. అది తెలుగు భాషా శిల్పానికి, కర్ణాటకసంగీత నాద శరీరానికి ఉన్న అవినాభావ సంబంధం. తెలుగు పదముల అంతమున అధికముగా అచ్చులు ఉండుటవలన గాయకునికి స్వరవిస్తరణకు, గమకాల ఆలంకరణకు విశేషమైన అవకాశం కల్గుతున్నది. కర్ణాటక సంగీతంలో సాహిత్యము, రాగము, భావము, తాళము పరస్పర భావ పూరకములు కనుక, ఆ భావవ్యక్తీకరణకు అనుకూలమైన ధ్వన్యాత్మక స్వరూపం, అలంకార సంపద, రసపోషణానుకూలమైన నిర్మాణం తెలుగుభాషను కర్ణాటక సంగీతానికి యోగ్యమైన రాజభాషగా నిలిపేయి.విభిన్న రస భావాలను తెలుగు వాగ్గేయకారులు వారి రచనలలో సమర్ధవంతంగా ఆవిష్కరించగలిగేరు.

కర్ణాటక సంగీతచరిత్రలో తెలుగు వాగ్గేయకారుల కృషి చిరస్మరణీయమైనది. అన్నమాచార్యులవారు వేలాదిగా సంకీర్తనలను, భక్తరామదాసు అనేక కీర్తనలను రచించి భక్తి సంగీతానికి బలమైన పునాది వేశారు. క్షేత్రయ్య రచించిన పదములు, ఇతరుల జావళులు శృంగార భక్తిరసాన్ని అపూర్వంగా ప్రతిబింబించాయి పండించాయి కూడ. త్యాగయ్య, శ్యామశాస్త్రి గారల శిష్య ప్రశిష్య బృందం తమిళ దేశమునందలి వారైనను వారి రచనలను గురువుల సంప్రదాయాన్ని అనుసరించి తెలుగులోనే కొనసాగించారు. శ్రీ దీక్షితుల వారు ప్రధానముగా సంస్కృతము నందే రచనలు చేసినప్పటికీ తెలుగు సంగీతరచనా సంప్రదాయ శైలీ స్వభావం, ప్రభావం వారి రచనలలో స్పష్టంగా కనబడుతుంది.

ప్రపంచం వ్యాప్తంగా నేడు భారతదేశంతో పాటు అనేక దేశములందు కర్ణాటక సంగీతం అభ్యసిస్తున్న వారిలో వివిధ భాషలు మాతృభాషలుగా గల విద్యార్థులు సైతం తెలుగు కీర్తనలను యథాతథముగా అభ్యసించి అందలి భావార్ధములను సంగ్రహముగా గ్రహించి గానము చేయుచున్నారంటే, అది మన తెలుగు భాషకు దక్కిన విశిష్ట పురస్కారం. తెలుగు పదాలకు అర్థం తెలియని విదేశీయులు అయ్యుండి కూడ త్యాగయ్య, అన్నమాచార్య, రామదాసాదుల రచనలను భక్తి పారవశ్యంతో పాడుతున్నారంటే అది తెలుగు భాష లోని సంగీతాత్మకు నిదర్శనం. అందుకేనేమో పాటకు బాట వేసిన తొలితరం వాగ్గేయ కవులు కూడ పాటకు (సాహిత్య రచనలో పాట అనేది ఒక పత్యేకమైన ప్రక్రియ) తెలుగు సాహిత్యాన్నే వినియోగించారు.

కర్ణాటకసంగీతానికి తెలుగుభాషకు గల సంబంధం కేవలం భాషాపరమైనది కాదు, అది సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సంగీత సాహిత్య పారంపర్యమునకు, సమన్వయమునకు ప్రతీక. కర్ణాటక సంగీతం ఉన్నంతవరకు ఉద్యమాలు ఎన్ని వచ్చినను కర్ణాటకసంగీతంలో తెలుగుభాష యొక్క స్థానం చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. తెలుగు భాషా వైభవాన్ని ప్రపంచం వ్యాప్తం చేసిన ఘనత తెలుగు వాఙ్మయం తో పాటుగా కర్ణాటక సంగీతానికి కూడ దక్కుతుందన్నది నిర్వివాదాంశం.

★ ★ ★

నివాళులు

# 'సుస్వర భూషణ' నారాయణ శర్మ

- మల్లాది సూరిబాబు
ఫోన్ : 9182718656

సంగీత కుటుంబంలో జన్మించటమే నేను చేసుకున్న పుణ్యం. మా తాతగారి కుటుంబంలో ఏ ఒక్కరికీ సంగీత వాసనంటూ లేదు, మా నాన్నగారికి తప్ప.

''హరికథా పితామహ'' ఆదిభట్ల నారాయణ దాసుగారి హరికథలు బాగా విని, తానూ పాడాలనే ఉత్సాహం పెంచుకున్న మా నాన్నగారు కీ.శే. మల్లాది శ్రీరామమూర్తిగారే మా తొలి సంగీత గురువు.



తనకు తానే గురువై, ఒకవైపు సంగీత విద్యా దర్పణాది, అనేక గ్రంథాలు తిరగేస్తూ, మరో వైపు రేడియోలో ప్రసారమయ్యే సంగీత కార్యక్రమాలనీ, ముఖ్యంగా మద్రాసు కేంద్రం నుంచి ఉదయం ప్రసారమయ్యే 'ఆరంగిశై' కచేరీలు శ్రద్ధగా వింటూ మా యింటిల్ల పాదికీ 'సంగీత వాతావరణాన్ని కలిగించిన సంగీత ఋషి' మా నాన్నగారు.

మా అమ్మ పాడుతూండేది. మా అక్కలూ పాడేవారు. బాల్యంనుండే మా అన్నదమ్ములందరం పాడేవాళ్ళం. కానీ శుద్ధమైన కర్ణాటక సంగీతంపై మక్కువ పెంచుకుని నాకెంతో సన్నిహితుడై నాతో తిరిగాడు నారాయణ శర్మ.

నా అదృష్టం కొద్దీ నా ప్రవృత్తికి తగ్గట్టుగా ఉద్యోగం, 1971 లో రేడియో ఎనౌన్సర్ గా విజయవాడ కేంద్రంలో చేరటమే నా సంగీతానికి ఓ మలుపు.

నా గొంతు విని ప్రోత్సహించిన వోలేటి వెంకటేశ్వరుగార్ సహచర్యం లభించటమే నాకో వరమయ్యింది.

మా నాన్నగారి సంగీత శిక్షణ పునాదైతే కర్ణాటక సంగీత సౌధాన్ని నిర్మించుకునే అదృష్టం వోలేటిగారి వల్ల లభించింది. సంగీత శిక్షణ కార్యక్రమంలో ఆయనతో పాడే ప్రతి కీర్తన వాడికి (నారాయణకు) పంపేవాణ్ణి. వారానికోసారి ఏలూరు నుండి విజయవాడ వచ్చేస్తూండేవాడు.

రైల్వే మెయిల్ సర్వీసులో సార్టర్ గా ఉద్యోగం, వాడి సంగీత ప్రవృత్తికి పూర్తిగా భిన్నంగా ఉన్నా సంగీతాన్ని వదలలేదు.

వోలేటి గురువుగారి పాఠంలోని విశేషం మాధుర్యం, కట్టుదిట్టమైన చిట్ట (NOTATION) మా యిద్దర్నీ ఆకర్షించాయి. అంతవరకూ కీర్తనలు

నొటేషన్ లో వుంటాయని ఎఱగం.

**స్వరం చూసి పాడే అలవాటు వోలేటి గారితోనే మొదలయ్యింది.**

సంగీత శిక్షణలో చెప్పే కీర్తనలు 'వాణి' పత్రికలో ప్రచురించేవారు. అవన్నీ జాగ్రత్తచేసి, ఒకొక్కటి వాడి మనవలకు చెప్పేవాడు.

**'సీతావర! సంగీతజ్ఞానము ధాత వ్రాయవలెరా!'**

మా నాన్నగారికి అబ్బిన సంగీత విద్య మొత్తం యింటిల్ల పాదికీ సంక్రమించటం దైవసంకల్పమే.

వోలేటి గారి పాఠం చిక్కగా ఉండి అనుస్వర సహిత గమకాలు **తగుపాళ్ళలో** ఉంటూ ఆకర్షణీయంగా ఉండేవి.

దీక్షితులవారి నవావరణకృతులు, స్వాతి తిరునాళ్ నవరాత్రి కీర్తనలు, నవగ్రహకీర్తనలు (ముత్తుస్వామి దీక్షితర్) మొదలగు ఎన్నో కీర్తనలు నేర్చుకున్న అదృష్టవంతుడిని. ఈ భాగ్యం నారాయణశర్మకూ దక్కాలని అనుకునేవాడిని.

ఏలూరులో బయలుదేరి ఖుర్దారోడ్ వరకూ రాత్రి తెల్లవార్లూ ట్రైన్ లో RMS BOGI లో కూర్చుని, ఉత్తరాలు సార్టవుట్ చేసే ఉద్యోగానికీ, సంగీతానికీ అసలు పొంతన ఉందా?

కవర్లు, ఉత్తరాలు కట్టిన బస్తాలను ఆనుకుని పడుకునేవాడు. కీర్తనల పాఠాల పుస్తకాలు కూడా ప్రక్కనే ఉండేవి.

**పాడే పాటలో నాణ్యత, నిర్దుష్టత, ఉన్నతమైన సంగీత విలువల కోసం తపించేవాడు.**

పెద్ద పెద్ద విద్వాంసుల క్యాసెట్స్ వింటూ రాత్రి పొద్దు పోయేవరకూ కూర్చుని వారు పాడిన రాగాలాపనకు కూడా స్వరం రాశేవాడు. తనకు తెలియని, కొత్త కీర్తన వినబడితే చాలు వింటూ రాసేశేవాడు.

'సంగీత కళానిధి' డా. శ్రీపాద పినాకపాణిగారు కర్నూలులోనే వున్నారనే సంగతి, ఆ ఊళ్లో వారికే తెలియదు.

మంచంమీద పడుకుని పాడుకుంటూ వందేళ్ళు జీవించిన సంగీత ఋషి ఆయన.

ఒకరిద్దరు సంగీత రసికులున్నా, పాణిగారి ఎదురుగా కూర్చోవడానికే భయపడేవారు.

కాస్తో, కూస్తో పాడగలిగినవారున్నా ఆయన ముందు పాడాలంటే తమలోపాలు బయట పడతాయేమోనని జంకేవారు.

నేనూ నారాయణశర్మ కలిసి పాణిగారి ఎదురుగా పాఠంచేసిన కీర్తనలనేకం. ప్రతి గమకానికీ ఓ టైమింగ్, విరామం కీర్తనలోని శ్రుతి శుద్ధత, రాగభావంతో నిండుగా గొంతు విప్పి పాడటం లాంటివన్నీ పాణిగారివల్ల తెలుసుకున్నాం.

కీర్తన పాఠానికుండే విలువను గ్రహించి ఒకటికి పదిసార్లు పాడుకుంటూ అవసరమైన మార్పులు చేర్పులూ చేస్తూ నిత్యం దీక్షగా పాడటం వాడి అలవాటు.

ఏలూరు లో సంగీతం పాడేవారున్నారు కానీ, నారాయణలోని ప్రతిభను గుర్తించిన వారు

అరుదే. అయినా, వాడు పదిమందికీ, తన పాట వినిపించాలని గానీ, తనకో గుర్తింపు రావాలని గానీ, ఏనాడూ అనుకున్నవాడు కాదు.

తనపాట తాను హాయిగా పాడుకోవటమే వాడికి తెలిసినది. పైగా కీర్తనలోని మాధుర్యం తెలిసి అనుభవిస్తూ పాడాడు.

సాధారణంగా నేర్చుకున్న కీర్తనలతో చాలామంది తృప్తి పడి ఊరుకుంటారు. అంతకంటే ఎలాటి ఆశలూ ఉండవు. కొత్తకీర్తన వినబడితే ఆ కీర్తన నేర్చుకోవాలనే ఆసక్తి ఉండదు. విని వెళ్ళిపోతారు. స్పర్ధ ఉండదు, పుట్టదు. నారాయణ విషయం వేరు.

యూ ట్యూబ్ లో వినబడే కొత్త కీర్తనలు లిస్ట్ ఔట్ చేసి, ఒక్కొక్కటీ స్వరం రాసి పెట్టుకునేవాడు. కీర్తనలే కాదు రాగాలాపన కూడా రాయటం విశేషం.

GN బాల సుబ్రహ్మణ్యం, సెమ్మంగుడి, KV నారాయణ స్వామి, మధురై సోమసుందర లాంటి వారి పాట తరచూ వినేవాడు. వాడి వినికిడి జ్ఞానం గొప్పది.

“ఏ విద్వాంసులైనా యితరుల సంగీతం వినాలిరా! గురువు చెప్పని విషయాలు కూడా వింటేనే తెలుస్తాయి. ఎంత విడమరచి బోధించినా తెలియవు” అనేవాడు.

యిది సత్యదూరం కాదు. స్వర సహితంగా ప్రతి కీర్తనా రాసుకోవడం, తాను రాశిన స్వరాన్ని రాగభావం వచ్చేలా పాడగలగటం, యితరులకు చక్కగా విడమరచి బోధించడం, నారాయణలోని ప్రత్యేకత. ఈ ప్రతిభ అందరిలో ఉండదు.

కొందరు గాయకులకు, వారి పాటలోని లోపాలు తెలియవు. మరొకరిని అడగాలని కూడా తోచదు, అడగరు. నామోషీ ఫీల్ అవుతారు. మా తమ్ముడి పాటలో లోపాలు గమనిస్తూ నేను సవరిస్తున్నప్పుడు పల్లెత్తు మాట అనేవాడు కాదు. పైగా సవరించిమని మళ్ళీ పాడి వినిపించేవాడు.

పాణిగారి పాఠమే అయినా, శిష్యులే అయినా వోలేటి, నేదునూరి, నూకల చినసత్యనారాయణ గారల ధోరణి భిన్నంగానే వుంటుంది. ముగ్గురి మనోధర్మాలూ, వేరేగా వుంటాయి, గమనించి వింటే.

వోలేటి గారి పాఠానికి ముగ్ధులైన మేమిద్దరం కష్టపడి అలాగే పాడాలని కలిసి, సాధన చేశేవారం.

వోలేటి గారు చెప్పిన నవ్రగహ కృతులు యిద్దరం పాడాం. సి.డి. చేశాం 1994 లో. పేరి శ్రీరామమూర్తి వయోలిన్, లక్ష్మీనారాయణ రాజు మృదంగం, నేమాని ఘటం వాయించారు.

నారాయణ శర్మ వయోలిన్ కూడా వాయిస్తాడని ఎవరికీ తెలియదు. వాద్యంకంటే పాటకే ప్రాధాన్యత నిచ్చాడు.

**దేశే దేశే కళ్రతాణి దేశే దేశే చ బాంధవః**
**తంతు దేశేనపశ్యామి యత్ర భ్రాతా సహోదరః**

భార్య లేకపోతే మరో భార్య దొరుకుతుంది. బంధువులు లేకపోతే ఎవరో ఒకరు బంధువుగా దొరుకుతారు. కానీ ఒక తల్లి కడుపున పుట్టిన సోదరుడు ఒక్కడు మాత్రమే.

★ ★ ★

సుధా తరంగమ్

# బహుముఖ ప్రజ్ఞ తన సరళి .. ఆయనే మన బాలమురళి..



- మోదుమూడి సుధాకర్ 9885183988. విజయవాడ

"అపురూప రాగరంజని" అనే పేరుతో బెజవాడ ఆకాశవాణివారు, అనేకమంది సంగీత విద్వాంసులతో క్రొత్త/అపురూప రాగాల పరిచయ కార్యక్రమం ధారావాహికగా నిర్వహించారు. అందులో భాగంగా డా.మంగళంపల్లి బాల మురళీకృష్ణ గారితో ఒక కార్యక్రమం చేశారు.

నాకే ఆ రికార్డింగ్ బాధ్యత అప్పజెప్పారు.మ్యూజిక్ స్టూడియోలో ముందు కీర్తనలు వరుసగా పాడేశారు వయోలిన్,మృదంగ సహకారాలతో మురళీగారు.

ఆయన సృష్టించిన సర్వశ్రీ, గణపతి, ఓంకారి వంటి 3 స్వరాల రాగాలు, మహతి, లవంగి, సుముఖం వంటి స్వరాంతర రాగాలు (4 స్వరాల రాగాలు), మనోరమ, వల్లభి, రోహిణి వంటి వినూత్న రాగాలను కొంచెం రాగాలాపనలతో, కొండొకచో స్వరప్రస్తారాలతో అద్భుతంగా పాడారు.

విభిన్న స్వరాలను మూర్ఛనలుగా పేర్చి, వాటికి అందమైన రూపునిచ్చి, వాటిలో స్వీయ రచనలను త్రిస్థాయిలలో అలవోకగా పాడటం అనేది అందరికీ సాధ్యమయ్యే పనికాదు. మొత్తం దాదాపు ఇరవై రాగాలను, వాటిలో రచనలు పాడాక, "ఇక పాటలు ఆపి, మాటలు రికార్డు చేద్దామా?" అన్నరాయన.

అయితే మా రేడియో ఇంజనీర్ ఒకాయన, "మాటలు TALK STUDIO లో చేద్దాం. ఈ STUDIO కేవలం సంగీతం కోసం నిర్దేశించినది" అన్నారు.

అలాగే అంటూ మురళీగారు, నేను, ఆయనతో వచ్చిన మరి కొందరు TALK స్టూడియోకి వెళ్ళాం. అక్కడ క్రింద కూర్చోవడానికి వీలులేదు.కుర్చీలో కూర్చొని, మైక్ లో మాట్లాడుతుంటే రికార్డ్ చేయటమే.

మురళీగారు మైక్ ముందు కూర్చొని,ఒక్క క్షణం మౌనంగా కళ్ళుమూసుకుని, "రెడీ..టేక్!" అన్నారు.

రికార్డింగ్ ఆరంభించాను.

ఆయన చేతిలో కాగితం ముక్కలేదు.మొత్తం ఇరవై రాగాలు.. (వాటిలో 3,4,5,6,7 స్వరాల రాగాలు ఉన్నాయి), ఇరవై మూర్ఛనలు (వాటిలో కొన్ని వక్ర, భాషాంగ రాగాలు ఉన్నాయి), వాటి స్వరస్థానాలు, (వాటిలో కొన్ని వివాది స్వరాలు ఉన్నాయి) అన్నీ జ్ఞాపకం పెట్టుకుని, మ్యూజిక్ స్టూడియోలో ఏ వరుసలోనైతే పాడారో అదే వరుసలో ఒక్కొక్కరాగం పేరు చెప్తూ, దాని స్వరస్థానాలు చెప్తూ, మూర్ఛనలు పాడుతూ ఎక్కడా తడబాటు లేకుండా ఒకే టేక్ లో మొత్తం రికార్డింగ్ పూర్తిచేశారు.

ఇదంతా నిజమేనా? మా కళ్ళను మేమే నమ్మలేకపోయాం. టకటకా రాగాలు చెప్పుకుంటూ ఆయన వెళ్లిపోతుంటే, వరుసలో అన్ని ఎలా గుర్తుపెట్టుకొని చెప్పగలిగారో మా ఊహకు అందలేదు.

నిశ్చేష్టులై ఉండిపోయిన మావంక చిరునవ్వుతో చూస్తూ, "బాగానే వచ్చిందా ? ఏవైనా పొరపాట్లు ఉంటే మీరు సరిచేసేయండి" అంటూ లేచారు మురళీగారు. సరిచేసేందుకు తప్పు ఉంటేకదా? నిజంగా అపురూప సంఘటన అది!

అది ఒక్క ఆయనకే సాధ్యం!

★ ★ ★

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## అలరించిన అపర్ణ గాత్రకచేరి




12.7.26 న ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం 738 కార్యక్రమం లో భాగంగా ఆదివారం ఉదయం కొత్తపేట సంస్థ కార్యాలయం నిర్వహించిన "పద్మవిభూషణ" డాక్టర్ మంగళంపల్లి బాలమురళి కృష్ణ, మధురగాయక ఎం.ఎస్. బాలసుబ్రహ్మణ్య శర్మ లకు నివాళిగా నిర్వహించిన కార్యక్రమంలో బెంగుళూరు కి చెందిన వెన్నెలకంటి అపర్ణ గాత్ర కచేరీ అందరిని అలరించింది. బాలమురళి గారి వర్ణంతో కచేరి ప్రారంభించి, సింహేంద్ర మధ్యమం రాగంలో కామాక్షి కృతి, మోహన రాగంలో నన్నుపాలింప, బాలసుబ్రహ్మణ్య శర్మ గారి తిల్లాన తదితర కృతుల గానం చేశారు. వీరికి వయోలిన్ పై హనుమంతు రామచరణ్, మృదంగం పై నూజివీడుకు చెందిన మంగళగిరి శ్రీధర్ ధీటుగా సహకారం అందించారు. ముందుగా సంస్థ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, సభ్యులు, విద్వాంసులు ఇరువురి చిత్రపటాలకు అలాగే 11-7-2026 శనివారం రాత్రి పరమపదించిన ప్రఖ్యాత గాయని ఎస్. జానకి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. జానకి మృతికి సభ 2 నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. చీలా రవిశంకర్ వారి జీవితవిశేషాలని, అలాగే విద్వాంసులను సభకి పరిచయం చేసారు.

ఈ కార్యక్రమం ధవళ సర్వేశ్వర రావు, దూసి శివరామ్ శర్మ, టి.మహేశ్వర రావు, యామిజాల ప్రభాకర సన్యాసిరావు సమర్పించారు...

కార్యదర్శి డాక్టర్ మండపాక రవి పర్యవేక్షించారు.

**– డాక్టర్ మండపాక రవి**

## నాదరమణీయమ్, వేణుగాన సభ



నాదరమణీయమ్, వేణుగాన సభ ప్రతి మాసం చివరి శనివారం నిర్వహించే విద్వాన్ / విద్యార్థి కచేరీలో భాగంగా మే నెల ఆఖరి శనివారం అనగా 30 తేదీన నిర్వహించిన కచేరీలో ప్రముఖ వేణు గాన విద్వాంసులు శ్రీ శేషం రమణ గారు వేణు గానం చేశారు. వీరికి వయోలిన్ పై విద్యాంసులు శ్రీ కొమాండూరి శౌరి రాజన్ గారు, మృదంగం పై విద్యాంసులు డా.శ్రీ పరవస్తు శ్రీనివాస గోపాలన్ గారు మరియు ఘటం పై విద్యాంసులు శ్రీ నాగ సాయి గారు సహకారం అందించారు.

ముందుగా భైరవి రాగం అట తాళ వర్ణంతో ప్రారంభించి, గౌళ రాగంలో ప్రణమామ్యహం శ్రీ గౌరీ సుతం, ఖమాస్ రాగంలో బ్రోచేవారెవరురా, మాయామాళవగౌళ రాగంలో స్వాతీ తిరుణాల్ రచన దేవదేవ కలయామితే, మాళవి రాగంలో త్యాగరాజస్వామి రచన నెనరుంచినాను, అనంతరం ముఖ్య అంశం గా హైమావతి రాగం ఆలాపన తో ప్రారంభించి శ్రీ కాంతిమతిం అనే దీక్షితుల వారి కృతి, నెరవు, స్వరకల్పన, తన్యావర్తన లతో ప్రేక్షకులను ఉర్రూతలూగించి, కాపీ రాగంలో శ్రీ లాల్గుడి జయరామన్ గారి తిల్లానాతో ముగించారు.

ఈ కార్యక్రమం నాగోల్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం లో నిర్వహించబడింది. ఈ కచేరీకి శ్రోతలు అధిక సంఖ్యలో వచ్చి, విని ఆనందించారు.

## లాలిత్యం - సంగీతసభ




హైదరాబాద్ లో విదుషి లలిత గారి సంస్మరణ గా వారి పేరు స్ఫురణకు వచ్చేలా నామకరణం చేయబడి ప్రారంభమైన ఈ సభలో 15.8.26న శ్రీ స్కంద వేలువలి (లలిత హరిప్రియగారల శిష్యులు) గానసభ రసరంజకంగా సాగింది.

సర్వశ్రీ ఓ.రాజశేఖర్, డి.ఎస్.మూర్తి,కె. శ్యామకుమార్ (కంజర) సహకారం మరింత రసస్ఫూర్తి కలిగించింది. ఈ సాయంతనం నిజంగా రసవంతమైంది. విదుషి శ్రీమతి హరిప్రియ ఆశీర్వదిస్తూ మరింతగా రాణించాలని తెలిపారు.

## శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు.



వారి సంగీత సభలో 12.7.26న కుమారి శక్తి మురళీధరన్ గాత్ర సంగీత సభ కుమారి గాయత్రీ విభావరి ,శ్రీ బుర్రా శ్రీరామ్ సహకార వాయిద్యాలతో నిర్వహింపబడింది.

నాట ధ్యానశ్లోకంతో ప్రారంభించి, బాల కనకమయ చేల-అఠాణ; రామభద్ర రఘువీర అనే శంకరాభరణ రాగ రచన రాగాలపన తో పాడారు.దురితకాలం, బిరకాసంగతులు, కొంత హిందూస్తానీ శైలి తో గానంచేశారు. గాత్రంలో మరింత స్పష్టత, భావము వాంఛనీయం. తరువాయి ఓజగదంబ -ఆనందభైరవి లో శ్యామశాస్త్రి గారిరచన, కొంత వరకు భావయుక్తంగానే ఆర్తి తో రాగస్వర సంచారాలతో పాడారు. మాకేలరా విచారము – ఉదయరవిచంద్రిక లో త్యాగయ్య గారి రచన, సాధన బలం బాగున్నది. కాని, చాల దురితంగా ఉంది. ఆస్వాదనకు అవకాశం లేకపోయింది. వాయులీనంపై గాయత్రీ విభావరి చక్కని ఒదుగు ప్రదర్శించి, సంప్రదాయ శుద్ధమైన శైలిలో తనదయిన రీతిలోచక్కగా సహకరించారు. ప్రధానాంశం తోడి రాగాలాపన బాగుంది. కొంత స్థిమితంగా పాడేరు. దాచుకోవలేనా కీర్తన నెరవల్, స్వరప్రస్తారాలు రక్తి కట్టించాయి. ఈమధ్య కాలంలోయీ కీర్తన అరుదుగా వినబడుచున్నది. శ్రీరామ్ మృదంగంతో చక్కని సహకారాన్నందించి కచేరికి మరింత శోభను చేకూర్చారు. ఆతరువాయి రాగమాలిక, తిల్లనాతో కచేరి ముగిసింది.

## అటు వైద్యవిద్య.. ఇటు నృత్యసాధన



కాకినాడ నగరానికి చెందిన కూచి భట్ల త్రినయని ప్రస్తుతం హోమియో వైద్య విద్య రెండో ఏడాది చదువుతున్నారు. సుమారు 13 సంవత్సరాల నుంచి నృత్యంలో శిక్షణ పొందుతున్నారు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ప్రపంచ నృత్యోత్సవాల్లో పాల్గొనడంతో పాటు, దేశంలోని పలు ' ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. రాష్ట్ర, జాతీయ స్థాయి నృత్య పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి బహుమతులు సాధించారు. ఇటీవల కూచిపూడిలో స్టార్ ఆఫ్ సౌత్ ఇండియన్ అవార్డు అందుకున్నారు. నాట్యంలో మరింత మంది కళాకారులను తయారు చేయాలనేది తన ధ్యేయమని త్రినయని చెప్పారు. ప్రఖ్యాత నాట్యగురువు శ్రీ కృష్ణకుమార్ వీరి గురువు...

# నాదసుధ, కాకినాడ.




నాదసుధ కాకినాడ ఆధ్వర్యాన అయ్యప్ప దేవాలయం ప్రాంగణంలోని త్యాగరాజ సన్నిధిలో 11.7.2026 శనివారం హైదరాబాద్ కళాకారులు విదుషి శ్రీమతి హరిప్రియ గారి ఆధ్వర్యంలో గాత్ర సంగీత సభ జరిగింది. ఇందులో వారి శిష్యులు శ్రీమతులు అరుణ-పద్మ,హెచ్.హేమవతి, శారదా జనస్వామి, సుసర్ల లక్ష్మీ ప్రసన్న, చిలకలపూడి పద్మజ, పెనుమర్తి శారద వివిధ వాగ్గేయకారుల రచనలను చక్కగా గానం చేశారు. వయొలిన్ పై శ్రీమతి బి.దుర్గాభవాని, మృదంగంపై శ్రీ మహదాసు ఏడుకొండలు విశేష సహకారం ఇచ్చారు. కార్యదర్శిని విదుషి ఎమ్.విజయకుమారి కళాకారులను పరిచయం చేయగా విదుషీ మణులు శ్రీమతులు పెద్దాడ సూర్యకుమారి, చావలి సూర్యకుమారి, చిలుకూరి సుబ్బలక్ష్మి కళాకారులను సత్కరించారు. కార్యక్రమం రసవంతంగా ముగిసింది.

మాతే మలయధ్వజ, సిద్ధి వినాయకం సేవే హం, దేవీ బ్రోవ సమయమిదే, అంబా జగదంబా, పద సన్నిధి నాకు ఏనాడు కల్గునో.. శశివదనా భక్త జనావన, శ్రీ సుబ్రహ్మణ్యాయ నమస్తే, స్వామినాధేన సంరక్షితోఽహం, నీపాదమే గతియని...నళిన కాంతి మతి, విజయాంబికే విమలాత్మికే....మోక్షము గలదా! సంతాన గోపాల కృష్ణం... ఆకలి వేళల అలపైన వేళల, బాలకృష్ణ రారా! బంగారు గని రారా!, అప్పన్న అయ్యప్పనే, సారమైన మాటలెంతో, తిల్లాన, భవాని అష్టకం, అంశాలు రక్తిగా వినిపించారు.



**18.7.26న శ్రీ శ్రీ శ్రీ సత్య చంద్ర శేఖరేంద్ర స్వామివారి దివ్య సన్నిధానం (మణిమంటపం కంచి) లో భక్త మార్కండేయ హరికథా గానం చేసిన విద్వన్మణి శ్రీ ఎమ్. సింహాచలశాస్త్రి భాగవతార్.**

# PARA...THE SUPREME 9వ వార్షికోత్సవ వేడుకలు, విశాఖపట్నం







PARA...THE SUPREME 9వ వార్షికోత్సవ వేడుకలు జూలై 19వ తేదిన కళాభారతి ఆడిటోరియంలో ఎంతో ఘనంగా జరిగాయి.

ప్రముఖ సంగీత విద్వాంసురాలు డాక్టర్ పంతుల రమ గారిచే స్థాపింపబడిన ఈ సామాజిక, సాంస్కృతిక చైతన్యోద్యమం గత 9 సంవత్సరాలుగా ఎన్నో కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సంగీతంపై అవగాహన, ఆసక్తి కల్పిస్తూ, ఎటువంటి భేదాలు లేని సామాజిక ఏకత్వాన్ని సాధించేందుకు కృషి చేస్తూ, విజయవంతంగా ముందుకుసాగుతోంది.

PARA...THE SUPREME గతంలో "స్వచ్ఛ స్వర్", " స్వర 2 రాగ", "స్పందన" వంటి వినూత్న కార్యక్రమాలతో పాటు సంగీతానికి సంబంధించిన ఎన్నో ముఖ్య అంశాలపై శిక్షణా శిబిరాలు మరియు ప్యానెల్ డిస్కషన్‌లను కూడా నిర్వహించారు. PARA...VISTARA ద్వారా వివిధ సంస్థలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలలో సంగీతం పట్ల ఆసక్తి, మక్కువ పెంపొందించే దిశ లో దిగ్విజయంగా పర...ది సుప్రీం పయనిస్తున్నది.

సంగీత విద్యార్థులు, విద్వాంసులు, రసజ్ఞులు, మరెందరో హాజరైన ఈ 9వ వార్షికోత్సవ వేడుకలు జూలై 19వ తేదీ ఉదయం విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియం లో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకలలో భాగంగా గత సంవత్సరం ప్రారంభమైన "పర ARNAVA YOUTH WING" యొక్క ప్రథమ వార్షికోత్సవం కూడా జరుపుకొన్నారు.

ఈ వార్షికోత్సవములకు ముఖ్య అతిథిగా డా. కోట ఆదిత్య, (ప్రముఖ ఎముకల వైద్యులు) మరియూ గౌరవ అతిథిగా శ్రీ యం.యస్.యన్. రాజు పాల్గొన్నారు. అతిథులతో కలిసి సంస్థ అధ్యక్షులు శ్రీ పి. గోపాలరావు, ఉపాధ్యక్షులు శ్రీ ముట్నూరి శ్రీనివాస నరసింహ మూర్తి, కార్యదర్శి డా. పంతుల రమ జ్యోతి ప్రజ్వలనలో పాల్గొని వేడుకలను శుభారంభం చేశారు.

ఉదయం కార్యక్రమాలు ARNAVA సభ్యులు నిర్వహించిన 'సంగీతము-శ్రావ్యత మరియు గణితం' "THE BALANCE OF MELO-DY AND MATH" అనే అంశం పై చర్చతో ప్రారంభమయ్యాయి. వివిధ సంగీత రచనలలో, శ్రావ్యత మరియూ గణితం మధ్య గల సమన్వయాన్ని

ఈ చర్చలో చాలా చక్కగా విశ్లేషించారు.

తరువాత, ప్రముఖ మృదంగ విద్వాంసులు, శ్రీ కె. సద్గురు చరణ్ "AESTHETICS AND MATHEMATICS OF LAYAVINYAS-AM" అనే అంశంపై, అందరికీ అర్థమయ్యేలా, అత్యంత సరళంగా, ఆసక్తికరంగా ఈ ప్రసంగాన్ని అందించారు.

మధ్యాహ్నం "LEARN A SONG" కార్యక్రమంలో భాగంగా, ప్రముఖ సంగీత విద్వాంసులు ముట్నూరి శ్రీనివాస నరసింహ మూర్తి, హాజరైన వారందరికీ కొన్ని అపురూప రచనలను నేర్పించారు.

తదుపరి, "GAME WITH RAGAS" అనే కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. అనంతరం, "LEARN A SONG" కార్యక్రమంలో నేర్చుకొన్న రచనలను అందరూ కలిసి ఆలపించారు.

వార్షికోత్సవ వేడుకలు సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు, డా. శ్రీమతి కొల్లూరు వందన అద్భుతమైన కచేరితో ముగిశాయి. వీరికి వయొలిన్ పై శ్రీ సాకేత పంతుల, మృదంగం పై శ్రీ కె. సద్గురు చరణ్ సహకరించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. కోట ఆదిత్య మరియూ శ్రీ ఎం.ఎస్.ఎన్. రాజు గార్లను పర అధ్యక్షులు శ్రీ పంతుల గోపాల రావు సత్కరించారు.

PARA... సంస్థ కార్యదర్శి డా. పంతుల రామ వందన సమర్పణ చేసి, సభను విజయవంతం చేసిన ముఖ్య అతిథులకు, కళాకారులకు, సభ్యులకు, మరియు హాజరైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

తరువాత జరిగిన గాత్ర సంగీత క్చెరీలో భైరవి రాగం అటతాళ వర్ణం తో చక్కటి ప్రారంభం చేసి తరువాత అనుపమ గుణాంబుధి ఆఠాణ రాగంలో సద్గురు శ్రీ త్యాగరాజ స్వామివారి కీర్తన శ్రావ్యంగా గానం చేసి శ్రోతల మన్ననలను పొందేరు.

తరువాత నతజనపాలిని కీర్తన నళినికాంతి రాగం లో తంజావూరు శంకరయ్యర్ రచన గానం చేసేరు.

భైరవి రాగంలో రాగం తానం పల్లవి పాడి వారి ప్రతిభను చూపి శ్రోతల కరతాళ ధ్వనులను అందుకున్నారు.

వారికి వయొలిన్ పై వర్ధమాన కళాకారుడు శ్రీ సాకేత్ పంతుల ధీటుగా సహకరించి కచేరీ స్థాయిని ద్విగుణీకృతం చేసేరు.

మృదంగం పైన శ్రీ సద్గురు చరణ్, ఆకాశవాణి కళాకారులు అద్భుతమైన సహకారం అందించి శభాస్ అనిపించుకున్నారు. తన్యావర్తనం అద్భుతంగా వాయించి కచేరీ స్థాయిని పెంచేరు.

తంబురా పై కుమారి ఆర్.యల్. కృష్ణ ప్రియ చక్కటి సహకారాన్ని అందించారు.

కళాకారులను కళాభారతి కార్యదర్శి శ్రీరామదాస డా. రాంబాబు సత్కరించారు.

# గాయిత్రి మహిళా సంగీత సన్మండలి – గుంటూరు




గాయిత్రి మహిళా సంగీత సన్మండలి నెలవారీ కార్యక్రమంలో భాగంగా డా. వింజమూరి వరదరాజ అయ్యంగార్ 111 జయంతి పురస్కరించుకొని వింజమూరి వరదరాజు అయ్యింగార్ మెమోరియల్ అవార్డును చెన్నైకి చెందిన శ్రీ జి. రవికిరణ్ గారికి జూలై 11 శనివారం అందించారు. జ్యోతి ప్రజ్వలన డా. కె. లలిత ప్రకాశ్ చంద్ర గారు చేసారు. విశిష్ట అతిథిగా శ్రీమతి వింజమూరి సంధ్య ముఖ్య అతిథిగా డా. బి. విజయ భాస్కర్ గారు విచ్చేశారు.

అనంతరం జి. రవికిరణ్ గారు గాత్ర కచేరీ జరిగింది. మొదటగా వింజమూరి వరద రాజు అయ్యింగారు రచించిన సింధు రామక్రియ వర్ణంతో ప్రారంభించి, దీక్షితార్ రచన శంఖ చక్రధర పాహి, త్యాగరాజుగారి ఎవ్వరనీ నిర్ణయించేదిరా– దేవామృత వర్షిణితో, అభేరిలో నగుమోము త్యాగరాజకృతి, వింజమూరి వారి రచన జాగేలరా నన్ను బ్రోచుటకు మొదలగు కీర్తనలు ఎంతో మంచి సంప్రదాయంతో గానం చేసారు. సహకారంగా వైలిన్ పై ఎన్. మదన్ మోహన్, మృదంగంపై బుర్రా శ్రీరామ్, ఘటంపై యం. హరిబాబు చక్కగా సహకారం అందించారు.

కార్యక్రమాన్ని డా. కె. లలిత ప్రకాష్ చంద్ర మరియు వింజమూరి ట్రస్ట్ వారు సమర్పించారు. ప్రధాన కార్యదర్శి యం.వై. శేషురాణి, వైస్ ప్రెసిడెంట్స్ పాటిబండ లలిత, డా. రాజరాజేశ్వరి, మంగ పర్యవేక్షించారు. **– మాధవపెద్ది మీనాక్షి**

# ఘనంగా నారాయణతీర్థుల 376వ జయంతి



నగరంలో కొత్తగ్రహారంలో గల రోటరీ దశిగి పేరాజు మ్యూజిక్ అకాడమీ లో ప్రఖ్యాత వాగ్గేయకారులు నారాయణతీర్థుల 376వ జయంతి ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి నారాయణతీర్థుల జీవిత విశేషాలు తెలియజేస్తూ నారాయణ తీర్థుల వారు మన తెలుగువారు కావడం అందున గుంటూరు జిల్లా కాజా గ్రామంలో ఆయన జన్మించారని కృష్ణుని ఆరాధిస్తూ సంస్కృతంలో శ్రీకృష్ణ లీలాతరంగిణి తోపాటు అనేక కీర్తనలను, తరంగాలను ఆయన రచించారని తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కొన్ని తరంగాలను గానం చేశారు. పాహిపాహిమాం పరమ కృపాళో, నంద నందన గోపాల, ఆలోకయే శ్రీబాలకృష్ణం తదితర తరంగాలు గానం చేసి వారికి నీరాజనం సమర్పించారు.

**డాక్టర్ మండపాక రవి**

# ప్రతిభావంతంగా మ్యూజిక్ అకాడమీ 4వ వార్షికోత్సవం






రోటరీ క్లబ్ ఆఫ్ విజయనగరం ప్రాజెక్ట్ లో భాగంగా రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుపబడుతున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ 4వ వార్షికోత్సవం కొత్తగ్రహారం రోటరీ కమ్యూనిటీ హాల్ లో 25-7-2026 శనివారం సాయంత్రం ఉత్సాహభరితంగా ప్రతిభావంతంగా జరిగింది. ఉసిరికల చంద్రశేఖర రావు, జ్యోతిప్రజ్వలన చేయగా వారితో పాటు డాక్టర్ డి.వి.శ్రీకాంత్, సూర్యలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి త్యాగరాజ స్వామి, పేర్రాజు గారి చిత్ర పటాలకు పూలమాలలు సమర్పించారు. అనంతరం గాత్రం, వీణ, మృదంగ, కీబోర్డ్, గిటార్ విద్యార్థుల ప్రదర్శనలు ప్రతిభావంతంగా జరిగాయి. ముఖ్య అతిథి గా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ దుర్గా బాలాజీ అతిధులుగా రోటరీ ప్రెసిడెంట్ నిర్మల్ జైన్, డాక్టర్ శ్రీకాంత్ విచ్చేసి విద్యార్థులను అభినందించి 4వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి తన ప్రసంగంలో కేవలం ఒక్క దగ్గర ప్రారంభం అయిన ఈ అకాడమీ ఈ 4 సంవత్సరాలలో విజయనగరంలో 3 శాఖలను విస్తరించింది. వీటితోపాటు పాలయవలస శంకర వేద పాఠశాలలో 30మంది వేద విద్యార్థులు మృదంగం నేర్చుకుంటున్నారని, ది సన్ స్కూల్లో 6 వ తరగతి వరకు సంగీతాన్ని సిలబస్ లో చేర్చారని తెలియజేశారు. దేశ విదేశాలలో ఆన్లైన్లో కూడా అనేకమంది నేర్చుకుంటున్నారని భవిష్యత్ లో ఈ అకాడమీ ఒక సంగీత విశ్వవిద్యాలయంగా అవ్వాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసారు. రొటీరియన్లు పాల్గొన్నారు. తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలకి సంగీతం నేర్పించడం ద్వారా మంచి విద్యాభివృద్ధి వస్తుందని బాలాజీ తెలియజేశారు విద్యార్థులను తీర్చిదిద్దుతున్న అధ్యాపకులు డాక్టర్ కె. ఎ.పద్మప్రియ, శారద, మంగతాయారు, మోడెకుర్తి వెంకట కామేశ్వర రావు, మహేశ్వర రావు, భానుహర్ష, బాలాజీస్వామి, సతీష్, నాగేంద్రప్రసాద్, పేరి కామేష్ కుమార్ తదితరులను అభినందించారు నగరంలో ప్రముఖులు డాక్టర్ ఏ.గోపాలరావు, సుధాకర్, రాధికారాణి, మురళీకృష్ణ, చీలా రవిశంకర్, సూర్యలక్ష్మి, భరద్వాజుల చక్రవర్తి, తల్లితండ్రులు, సంగీతాభిమానులు విశేషంగా పాల్గొన్నారు.

**– డా. మండపాక రవి**

# సంగీత లహరి,రాజమహేంద్రవరం.



నెలవారీ సంగీత సభ జూలై నెల కార్యక్రమంగా 26.7.2026న హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ వికాస్ మైత్రేయి గాత్రసంగీత సభ జరిగింది. శ్రీ రాగ వర్ణం తో ప్రారంభించి, నాట రాగం లో సరసీరుహాసన ప్రియే పులియుర్ దొరై స్వామి వారి కీర్తన, అనంతరం ఆరభి రాగం క్లుప్తంగా గా పాడి, 'నాద సుధా రసంబిలను' అనే త్యాగరాజ కీర్తన, అనంతరం ఉప ముఖ్యాంశం గా వరాళి రాగం శ్రావ్యం గా ఆలపించి శ్రోతల మన్ననలు పొందారు.'మామవ మీనాక్షి ' దీక్షితర్ వారి కీర్తన, ఈ మధ్య కాలంలో అరుదుగా వినిపించే నెరవల్, 'శ్యామేశంకరి' అనే చోట అద్భుతంగా సంగతులు పాడి, అనంతరం స్వర ప్రస్తారం కూడా అతీతం రెండక్షరాల జాగా కి వారు పాడిన విధం వారి విద్వతుకు నిదర్శనం. పశుపతి ప్రియ రాగంత లో శరవణ భవ అనే ముత్తయ్య భాగవతార్ కీర్తన అనంతరం ఖరహర ప్రియ రాగం రంజకం గా పాడి శ్రోతలను అలరించారు.

శ్రీ ఉపద్రష్ట శ్రీహరిప్రసాద్,శ్రీ అనిపిండి కామేశ్వరరావు,శ్రీ సహదేవుడు(కంజిర)తో చక్కని సహకారం అందించారు.

ఖరహర ప్రియ లో 'చక్కని రాజమార్గము లుండగా' అనే త్యాగరాజస్వామి వారి కీర్తన, దానిలో వారు చేసిన స్వర విన్యాసం సభికులను ఆనంద పరవశులను చేసింది.




**తేది : 16-08-2026 న**
**టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు తిరుపతి ఆధ్వర్యంలో**
**సంగీత నృత్యోత్సవ సప్తాహంలో**
**రాజమండ్రిలో కార్యక్రమం.**
**గానం: శ్రీ శిష్టు మధుసూదన్,**
**వయోలిన్: యు. శ్రీహరి ప్రసాద్,**
**మృదంగం: శ్రీ కె. సాయికృష్ణ**

# స్వరరాగసుధ, కాకినాడ ; సంప్రదాయ పాఠశాల, విజయవాడ.





కంచిపీఠం ఆధ్వర్యాన నడుస్తున్న సంప్రదాయ పాఠశాల ప్రాంగణంలో ది.24.7.26 న వాగ్గేయ కారుల ఉత్సవం, ప్రత్యేకించి నారాయణ తీర్థుల ఉత్సవం శ్రద్ధాభక్తులతో జరిగింది.

విజయవాడ డిప్యూటి పోలీస్ కమీషనర్ శ్రీమతి డా.కె.జి.వి.సరిత ముఖ్య అతిథిగా, గానకళ పత్రిక సంపాదకులు శ్రీ మునుగంటి వెంకటరావు గౌరవ అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. శ్రీమతి సరిత విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ స్త్రీలు అన్నిరంగాల ముందుకు వెళుతున్నారని, లలితకళారంగంలో కూడా అగ్రగాములు వారేనని, మీరంతా మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

మీరందరికీ లభించిన చక్కని అవకాశం ఈ సంప్రదాయ పాఠశాల అని, ఈ అవకాశం సద్వినియోగ పరచుకోవాలని గానకళ సంపాదకులు కోరారు.

మొదట స్వరరాగ సుధ వ్యవస్థాపకులు శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి స్వాగతం పలికి సభా నిర్వహణ చేయగా ప్రిన్సిపాల్ శ్రీమతి విష్ణుభట్ల పద్మావతి కార్యక్రమ ఏర్పాటు చేసి వందన సమర్పణ చేశారు. ఉదయం నుండి సాయంకాలం దాక జరిగిన ఈసభలో దేశం నలుమూలలనుండి విష్ణుభట్ల వారి శిష్యులు వచ్చి పాడారు. ఆకర్ష్, ప్రదీప్, శశిధర్, అఖిల్, సందీప్, రవి, లక్ష్మణమూర్తి, విఠల్ శాస్త్రి, కీర్తన, దాక్షాయిణి, ప్రణీత సాయి, సాహితి, అయ్యగారి లక్ష్మి, నిఖిల, ప్రహ్లాద్, జోషిత పాల్గొన్నారు.

'సంప్రదాయ మహిళా కళాశాల' విద్యార్థినులు కూడా కొన్ని కీర్తనలు గురువు శ్రీమతి అమూల్య ఆధ్వర్యంలో చక్కగా వినిపించారు.

సాంప్రదాయ పాఠశాల విద్యార్థినులు : వి.ఎస్. సాయి శృతి, యం. లహరి, పి. సుమనశ్రీ, కె. వల్లీశ్రీ, బి. ఐశ్వర్య, యస్. శివాంజలి, జి. సువర్చల, బి.హెచ్.బి. అక్షయ, పి. వర్షిణి, వి. సత్య, ఎ. సత్యస్వాతి, టి. హంసిని, పి. తేజస్విని, జె. శ్రీహిత, యం. శివాత్మిక, యస్. హేమవల్లీ, వి. మహతి, యల్. హర్షిత, పి. హరిణి, వి. యసస్విని, వి. లిఖిత, పి. లలిత, సి.హెచ్. లాస్య వర్ధని, యం. భార్గవి, యు. రిషిత, బి. సాయి సాత్విక, కె. సర్వఘ్న, యన్. మహతి, టి. శ్రీజ, ఎ. అనన్య పాల్గొని కొన్ని కీర్తనలు వినిపించారు.

శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి దేశం నలుమూలల స్వరరాగ సుధ పాఠశాలలను ఏర్పాటు చేసి అందిస్తున్న సంగీత సేవ అభినందనీయమని గానకళ సంపాదకులు శ్రీ మునుగంటి వెంకట్రావు సభా ముఖంగా తెలియజేశారు.

# స్వరరాగసుధ, కాకినాడ ; సంప్రదాయ పాఠశాల, విజయవాడ కార్యక్రమ దృశ్యమాలిక


















**24.07.26 శుక్రవారం 6.15 p.m.**

నాద ఇన్బమ్

డాక్టర్ (శ్రీమతి) ఆండాళ్ అనంతనారాయణన్ &

శ్రీ వి. అనంతనారాయణన్ మెమోరియల్ –కచేరీ

విదుషి వి ఎస్పీ గాయత్రి శివాని –వయోలిన్ సోలో,

విద్వాన్ బి శివరామన్ – మృదంగం

విద్వాన్ కె వి గోపాలకృష్ణన్ – కంజీరా

# విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతి, విశాఖ.





అన్ని కళలని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉన్న కళాభారతి మరుగున పడిపోతున్న మన ప్రాచీన కళలు హరికథలు, బుర్రకథలు వాటిని వెలుగులోకి తెచ్చి ప్రజా బాహుళ్యానికి వినిపించాలని సత్సంకల్పంతో ప్రతి సంవత్సరం జూలై మాసంలో మూడు రోజులు హరికథ బుర్రకథ ఉత్సవాలు నిర్వహిస్తున్నది.

అందులో భాగంగా ఈనెల జూలై 24, 25, 26 మూడు రోజుల హరికథ ,బుర్రకథ ఉత్సవాలను అధ్యక్షులు శ్రీ మాన్ MSN రాజు, కార్యదర్శి శ్రీరామదాస డా. రాంబాబు, కోశాధికారి శ్రీ పైడా కృష్ణ ప్రసాద్, ట్రస్ట్ శ్రీ ఎస్ రామ్ గోపాల్, పంతుల నరసింహారావు తదితరులు జ్యోతి ప్రకాశం చేసి శుభారంభం చేశారు.

తర్వాత జరిగిన హరికథ కాలక్షేపంలో మొదటి రోజున శ్రీ ఎం. రాంబాబు భాగవతార్ మహాకవి కాళిదాసు హరికథను అత్యంత శ్రావ్యంగా గానం చేసి ప్రేక్షకుల మన్ననలను పొందారు

శ్రీ కాళిదాసు సంస్కృత సాహిత్య చరిత్రలో అత్యుత్తమ కవి మరియు నాటకకర్త. కాళికాదేవి అనుగ్రహంతో మహాజ్ఞానిగా మారి, అభిజ్ఞాన శాకుంతలం, మేఘసందేశం, కుమారసంభవం వంటి అమర కావ్యాలను రచించారు శ్రీ కాళిదాసు.

సంస్కృత సాహిత్యంలో ఆయన ప్రతిభకు గాను "కవికుల గురువు" అనే బిరుదు పొందారు. :

కాళిదాసు చిన్నతనంలో విద్యాహీనుడిగా ఉండేవాడని, విద్యా గర్వియైన విదుషీమణి విద్యోత్తమతో వివాహం జరగడం, ఆమె అవమానించడంతో కాళికాదేవిని తీవ్రంగా తపస్సు చేసి అసాధారణ పాండిత్యం సాధించాడని హరిదాసు చాలా చక్కగా వివరించి శ్రోతల కరతాళ ధ్వనులను అందుకున్నారు .

వీరికి వైలిన్ పై శ్రీ దక్షిణామూర్తి విజయవాడ వాస్తవ్యులు అలాగే మృదంగంపై శ్రీ సరస్వతుల హనుమంతరావు దీటుగా సహకరించారు.

రెండవ రోజున తొలి ఏకాదశి మహా పర్వదినం సందర్భంగా "రుక్మిణి కళ్యాణం" హరికథా కాలక్షేపం ప్రముఖ భాగవతారిణి శ్రీమతి ఎం నాగమణి చేశారు.

రుక్మిణి, శ్రీకృష్ణుని విగ్రహాలను అత్యంత సుందరంగా అలంకరించి వేదికపై ఉంచి పూజా కార్యక్రమం నిర్వహించి అందరికీ ఆ పరమాత్మ దర్శనంభాగ్యం కలుగజేశారు.

విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ, త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ మరియు హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ దేవాదాయ ధర్మాదాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని శ్రీ ఎస్.రామగోపాల్, డా.జి.ఇందిర ,పంతులు నరసింగరావు జ్యోతి ప్రకాశం చేసి శుభారంభం చేశారు.

ఈరోజు చాలా ముఖ్యమైన పర్వదినం తొలి ఏకాదశి, నారాయణ తీర్థుల వారి జయంతి కూడా అవడం మరొక ముఖ్యమైన విషయం. భాగవతారిణి కళ్ళకు కట్టినట్టుగా చక్కటి శ్రావ్యమైన కంఠంతో గానం చేస్తూ ,నృత్యం చేస్తూ, హాస్యం పండిస్తూ చక్కగా హరికథ చెప్పిన తీరు అందరికీ నచ్చింది.

వైలిన్ పై శ్రీ దక్షిణామూర్తి, మృదంగంపై హనుమంతరావు సహకారం అందించి కథ బాగా రక్తి కట్టడానికి దోహదపడ్డారు. డాక్టర్ ఇందిర. భాగవతారిణి ని అయోధ్య రాముని శాలువా కప్పి సత్కరించారు.

మూడవ రోజు కార్యక్రమానికి ముందుగా కళాభారతి కార్యదర్శి హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ జోనల్ కోఆర్డినేటర్ శ్రీరామదాస డాక్టర్ రాంబాబు ,శ్రీ ఎస్ రామగోపాల్ ,డాక్టర్ ఇందిరా, శ్రీ ఎంఆర్కే రావు, శ్రీ నర్సింగరావు జ్యోతి ప్రజ్వలన చేసి శుభారంభం చేశారు.



నేటి బుర్రకథలో

జగన్నాధుని కథ చక్కని హాస్యంతో కథాంశాన్ని వివరంగా చెప్పి అలరించారు.శ్రోతలు ఎప్పుడూ వినని ఎన్నో విశేషాలు శ్రీ జగన్నాధస్వామి వారి గురించి తెలుసుకున్నామని, మహదానందాన్ని వ్యక్తం చేసేరు.

కార్యదరి శ్రీరామదాస డా. రాంబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా వార్షిక జాతీయ పురస్కారం మరియు 6 రోజుల సంగీత, నృత్య, పౌరాణిక నాటక ఉత్సవాలు ఆగస్టు 22 నుంచి 27 వరకు ఉంటాయని,

కళాభారతి స్థాపించి 40 సంవత్సరాలు నిండిన సందర్భంగా అన్ని కార్యక్రమాలు అత్యున్నత స్థాయి కళాకారులవి ఏర్పాటు చేశామని మీరందరూ రావాలని కోరారు.

# విజయవాడలో సంగీత సద్గురువులు శ్రీ సుసర్ల, పారుపల్లి వారల ఆరాధన ఉత్సవాలు





విజయవాడలో సంగీత సద్గురువులు శ్రీ సుసర్ల, పారుపల్లి వారల ఆరాధన ఉత్సవాల కార్యక్రమాలు జయప్రదం అయ్యాయి. జూలై 17 నుండి 21 వరకు అయిదురోజులపాటు సంగీత ప్రియులను అలరించిన ముప్పై కార్యక్రమాలలో చివరిగా అన్నవరపు రామస్వామి గురువుగారు,శిష్యులతో ఇష్టాగోష్టిగా తమ సంగీతానుభవాలను ఎన్నో పంచుకొని, ఉత్సవ శోభను ఇనుమడింపచేశారు.

85 ఏళ్లుగా ఈ ఉత్సవాలతో తన అనుబంధాన్ని, గురుశిష్యుల మధ్య ఉండవలసిన బంధాన్ని 101 సంవత్సరాల వయస్సులో కూడా ఎంతో ఓపికతో వివరించారు.

ఈ ఏడు సద్గురు ఆరాధన ఉత్సవం దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు



**ఉత్సవాలలో భాగంగా 19-7-26 ఆదివారం ఉదయం జరిగిన త్యాగరాజ పంచరత్న కృతుల గోష్టిగానం**

## భక్తిపారవశ్యంతో సంగీత భజనామృతం



కర్ణాటక మైసూరు శ్రీ దత్తపీఠంలో దత్త విజయానంద తీర్థ బాలస్వామి చేస్తున్నటువంటి చాతుర్మాస్యం సంగీత సేవలో భాగంగా విజయనగరం రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి అధ్యాపకులలో ఒకరు పద్మావతీ శారద నేతృత్వంలో విద్యార్థులు టేకుమళ్ళ జానకి, పద్మావతి, ఆదిభట్ల శ్రావణి, శోభారాణి, అనన్య, సంగీతకామాక్షి, సాహితీ శ్యామల, డాక్టర్ చీలా రవిశంకర్ సంగీత భజనామృతం లో వివిధ దేవతలపై వినాయక, ఆంజనేయ, త్రిపుర,శివ తదితర కీర్తనలు ఈ సంగీత భజనామృతములో పాల్గొని గానం చేశారు. రాజమండ్రి నుండి శ్రీ మురళీధర్ గారు వారి శిష్యబృందంతో నిర్వహించిన కార్యక్రమం లో అకాడమీని భాగస్వామ్యం చేశారు. డాక్టర్ మండపాక రవి మృదంగంతో సుబ్రహ్మణ్యం కీబోర్డ్, ఆనంద్ కుమార్ తలపై, రంగాజీ వాద్యాలతో సహకారాన్ని అందించారు. బాలస్వామి వారు అకాడమీ కి ముందు విరివిగా అవకాశాలు కల్పిస్తామని ప్రతీ ఒక్కరూ సంగీత సేవ చేసుకొని తరించాలని ఆశీర్వదించారు.

**డాక్టర్ మండపాక రవి**

## బెజవాడ రామకృష్ణాపురంలో ప్రధాన రహదారికి పారుపల్లివారి పేరు



"గాయక సార్వభౌమ" పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి 75 వ వర్ధంతి రోజు,బెజవాడ రామకృష్ణాపురంలో ఉన్న పారుపల్లివారి విగ్రహానికి స్థానిక MLA బొండా ఉమామహేశ్వరరావు గారు నివాళి అర్పించి, అన్నవరపు వారి విజ్ఞప్తి మేరకు అక్కడి ప్రధాన రహదారికి పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి పేరు ఆగస్ట్ 15 లోపుగా పెట్టిస్తానని మాటిచ్చారు. వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో సద్గురువులు పారుపల్లి, సుసర్ల వార్ల వర్ధంతి ఉత్సవాలు ఆరంభమయ్యాయి. కళాకారులు తమ సంగీతంతో గురువులకు నాదార్చన చేశారు. ఈ ఉత్సవాలు 21-7-26 వరకు వైభవంగా జరిగాయి.

# తణుకులో శ్రీమతి భమిడి కమలాదేవి గారికి "సంగీత సేవారత్న" బిరుదు ప్రధానం



భగవాన్ శ్రీ శ్రీ శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ వారి ఆశీస్సులతో, మరియు వాయులీన భీష్మాచార్య, నాదసుధార్ణవ, పద్మశ్రీ అన్నవరపు రామస్వామి గురువుగారి శుభాశీస్సులతో....

ఆంధ్రదేశంలో సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి శిష్య పరంపరను స్థాపించి, కొనసాగించిన బ్రహ్మశ్రీ సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి, గాయక సార్వభౌమ శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారల, సంగీత ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకొని,... మరియు గురు పౌర్ణమి నాడు గురుపూజోత్సవంలో భాగంగాను......

త్యాగరాజ ప్రశిష్య పరంపరకే చెందిన సంగీత విద్వాన్ శ్రీ గురజ ద్రోణేంద్ర ఫణి కుమార్. (EMPANELLED ARTIST. F. O. I. MINISTRY OF CULTURE. GOVT. OF INDIA.) వారి శ్రీమతి తో కలిసి, కృష్ణాజిల్లా గూడూరులో స్థాపించిన SIRAJ ON-LINE CARNATIC MUSIC SCHOOL. (SOCMS) తరపున నిస్వార్ధత, స్వచ్ఛత, మరియు ప్రతిభ తో కూడిన విశిష్ట వ్యక్తులను గుర్తించి ప్రతి సంవత్సరం స్వయంగా సన్మానిస్తున్నారు.

పద్మశ్రీ అన్నవరపు రామస్వామి గారు, కళా రత్న శ్రీ మోదుమూడి సుధాకర్ గారు, మొదలగువారు సన్మానితులలో కొందరు.

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శాస్త్రీయ సంగీత వ్యాప్తికి విశేష కృషి చేస్తున్న రాయసం రాజ్యలక్ష్మి సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మరియు సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవ సొసైటీ కార్యదర్శి, సంగీత విదుషి, సంగీత సేవా ప్రశస్తి, శ్రీ కళా పూర్ణ, శ్రీమతి భమిడి కమలాదేవి గారిని ఫ్లూట్ ఫణి, శ్రీమతి శ్రీదేవి దంపతులు స్వయంగా తణుకులో వారింటికే వచ్చి ""సంగీత సేవారత్న"" బిరుదుతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమానికి స్థానిక త్యాగరాజ ఆరాధన ఉత్సవ సొసైటీ అధ్యక్షురాలు శ్రీమతి చిలుకూరి లక్ష్మీ సుజాత, నన్నయ భట్టారక పీఠం కార్యదర్శి శ్రీ కొల్లి రామచంద్ర శర్మ, DR శ్రీరామచంద్రమూర్తి వీణ విద్వాంసులు శ్రీమతులు ఇవటూరి ప్రమీలారాణి,, చల్లా అన్నపూర్ణ, A. GRADE. తెలుగు పండితులు DR.. తాడేపల్లి వీరలక్ష్మి రాయసం.రాజ్యలక్ష్మి సంగీత కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు ఇంకా అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొనగా,

శ్రీ చిట్టారామయ్యగారి వేద ఆశీస్సుల మధ్య. కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా జరిగింది.

# గాయిత్రి మహిళా సంగీత సన్మండలి – గుంటూరు





గాయిత్రి మహిళా సంగీత సన్మండలి నెలవారీ కార్యక్రమంలో భాగంగా స్థానిక అన్నమయ్య కళావేదిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం బృందావన్ గార్డెన్స్ లో శనివారం 01-08-2026 న **గాయత్రి సంగీత విద్వన్మణి** బిరుదును ప్రముఖ వయోలిన్ విధ్వాంసురాలు శ్రీమతి బి.వి. దుర్గా భవానికి అందచేసారు. జ్యోతి ప్రజ్వలన శ్రీమతి గోపరాజు దుర్గాకుమారి చేసారు. ఆత్మీయ అతిథి విశ్వ సంకీర్తనాచార్య శ్రీ తుర్లపాటి శంభయాచార్య భాగవతార్ సన్మాన పత్రం చదివారు. గానకళ సంగీత మాసపత్రిక సంపాదకులు శ్రీ మునుగంటి వెంకట్రావు గారు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సన్మానపత్రం అందజేసారు. సన్మానకర్త శ్రీమతి అరుణ విద్యా సాగర్. అనంతరం బి.వి. దుర్గా భవాని గారి వయోలిన్ సోలో కచేరి జరిగింది.

మొదటగా మనవియాలకించ అనే కృతి నళినకాంతి రాగంలో త్యాగరాజుగారి రచనతో ప్రారంభించారు. కచేరీలోని ప్రధానాంశం మోహనలో చేసిన రాగమాలిక విధానం సాధారణంగా కల్పన విన్యాసం చేసినపుడు రాగమాలికగా వినిపించడం సహజం. శ్రీమతి దుర్గాభవాని మరింత వైవిధ్యంగా చేసారు. మోహన ప్రధానాంశం. అది ఔడవ రాగం కాబట్టి ఔడవరాగ మాలిక చేసారు. మన కర్ణాటక సంగీతంలో అద్భుతమైన విషయం ఒక రాగంలో ఒక్క స్వర మార్పు చేతే చాలా రస మార్పు చూపించవచ్చు.

మెహన వాయించి అందులో శుద్ధ దైవత మార్పుతో వాసంతి హంసధ్వని, దానికి కైశిక నిషాదంతో వీణా వాదిని, శుద్ధ సావేరి వాయించి శుద్ధ రిషభం, శుద్ధ దైవత స్వరాలతో లతాంత ప్రియరాగాన్ని,హంసనాదంవాయించిదానికిరిషభం బదులు గాంధారంలో అమృత వర్షిణిని, హిందోళం దానికి కాకలి నిషాదాన్ని చేసి చంద్రకౌంస్, రేవతి వాయించి దానిని రిషభ మార్పులో మధ్యమావతి వాయించి ముగించారు. ఆ ప్రక్రియ చాలా కష్టతరం, అయినా అవలీలగా వాయించి సభలోని సంగీత రసజ్ఞులను ఆనందింపచేసారు. వీరికి మృదంగంపై సద్గురు చరణ్, ఘటంపై హరి బాబుగార్లు వారికి సహకారం అందించారు. ఈ ముగ్గురు వారి కళా నైపుణ్యాన్ని సమఉజ్జీలుగా ప్రదర్శించారు.

కార్యక్రమాన్ని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషన్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ, కారుమూరి హాస్పిటల్స్, గోపరాజు వెంకట యజ్ఞేశ్వర హనుమత్ కుమార్ దత్తా సమర్పించారు.

ప్రధాన కార్యదర్శి యం.వై. శేషురాణి, కార్యదర్శి మంగాదేవి, ఉపాధ్యక్షురాలు పాటిబండ లలితాదేవి ఇతర సభా కార్యవర్గ సభ్యులు, కార్యదర్శి శ్రీమతి శేషురాణి అభిమాన భృందం ఈ కార్యక్రమ విజయవంతానికి తోడ్పడి ఆంధ్రదేశంలో ఈ సభకు ప్రత్యేకత సంపాదించి పెడుతున్నారు.

**– శ్రీమతి మాధవపెద్ది మీనాక్షి**

# ఉత్సాహభరితంగా దేశభక్తి గీతాల పోటీ...







రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ కొత్తగ్రహారం లో శనివారం సాయంత్రం నిర్వహించిన దేశభక్తి గీతాలపోటీ ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది. ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖరరావు పోటీలు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి పోటీలవివరాలు నియమనిబంధనలు తెలియజేశారు. ఆఫ్లైన్, ఆన్లైన్ పద్ధతులలో పోటీలు నిర్వహించారు. సుమారు 100 మంది ఈ పోటీల్లో పాల్గొని దేశభక్తిని గానం చేశారు. డాక్టర్ డి.వి.శ్రీకాంత్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నాగేంద్రప్రసాద్, అంగతాయారు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు ముత్యాల రావు, చాలా రవిశంకర్, భవాని పోటీలకు సహకరించారు.

– డాక్టర్ మండపాక రవి

# శ్రీ సద్గురు సన్నిధి, రాజమహేంద్రవరం





తేది : 02-08-2026 ఆదివారం 167 వ నెలవారీ శాస్త్రీయ సంగీత నృత్య కార్యక్రమము శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణం, త్యాగరాజ నగర్, రాజమహేంద్రవరం. శ్రీ సరస్వతుల హనుమంతరావు. గాత్ర సంగీత సభకు శ్రీ హనుమంతు రాంచరణ్ వైలన్, శ్రీమానేపల్లి పురుషోత్తం డోలు పై సహకరించగా కార్యక్రమం రక్తిగా సాగింది.

## రసరమ్యం డాక్టర్ పూర్ణచంద్రిక గానం



ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం 740 కార్యక్రమం మంగళవారం సాయంత్రం కొత్తపేట ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనం లో ఇటీవల నిర్వహించిన వార్షికపోటీల్లో విజేత డాక్టర్ ప్రయాగ పూర్ణచంద్రిక గాత్రకచేరి అందరినీ అలరించింది. బాలమురళీకృష్ణ వర్ణంతో ప్రారంభించి సిద్ధివినాయకం, దేవదేవ కలయామిదే తదితర కృతులను రసరమ్యంగా గానం చేయగా హనుమంతు రామచరణ్ వయొలిన్ పై శివకుమార్ మృదంగంపై ధీటుగా సహకరించారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ మండపాక రవి కళాకారులను సభకు పరిచయం చేశారు. అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ స్వప్నహైందవి, ఆలవిల్లి విశ్వనాథం, గంధం సుజాత, మూర్తి తదితరులు, సంగీత ప్రముఖులు శ్రోతలు విశేషంగా పాల్గొన్నారు.

**డాక్టర్ మండపాక రవి**

## దివ్య ప్రణవి జ్యోశ్యుల సంగీత అరంగేట్రం



స్లోన్ థియేటర్, గ్రీన్స్బరో డే స్కూల్, అమెరికాలో ఆగస్టు 15న జరిగింది. కుమారి దివ్య ప్రణవి శ్రీమతి జంధ్యాల దివ్య గారి (కలైమామణి శ్రీమతి విద్యా సుబ్రహ్మణ్యం శిష్యురాలు) వద్ద సంగీతాభ్యాసం చేస్తూ తొలి కచేరి చక్కగా నిర్వహించింది. 'వలచి వచ్చి' నవరాగ మాలికా వర్ణంతో శుభారంభం చేసి హంసధ్వనిలో వినాయక నినువినా; సామజవరగమన, ఎంతమాత్రమున, సింహేంద్ర మధ్యమంలో రామరామగుణసీమ (ప్రధాన అంశం), రంగపురవిహార, వెంకటరమణనె బారో, భాగ్యశ్రీలో లాల్గుడి తిల్లాన, మంగళంతో కచేరి ముగించి అభినందనలు అందుకొన్నది. వయొలిన్ పై శ్రీ సిద్ధార్థ గిరిధరన్, మృదంగంపై శ్రీ నారాయణ్ కుమార్ రక్తిగా సహకరించారు. ఈమె కాలేజి చదువులలో మంచి చురుకైన విద్యార్థిగా పేరొంది, ఇటు సంగీతం లో కూడా సమయం కేటాయించుకొని పదేళ్లుగా సంగీతం నేర్చుకొంటూ మొదటి ప్రయత్నంలో విజయం సాధించింది. కుమారి ప్రణతి తండ్రి శ్రీజ్యోశ్యుల శ్రీధర్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కాగా తల్లి డా.శ్రీమతి ప్రవీణ ప్రఖ్యాత అంకాలజిస్ట్. గానకళ కుమారి ప్రణతికి అభినందనలు అందజేస్తున్నది.

## "స్వరఝరి" - విజయవాడ



16-8-2026 నాడు "స్వరఝరి" (విజయవాడ) లో JA జయంత్ గారి వేణు వాదనం ఆద్యంతం ఆకట్టుకుంది. సంగీత రత్న శ్రీ పెమ్మరాజు సూర్యారావు గారి స్మృత్యర్థం వారి కుటుంబ సభ్యులు, శిష్యులు ఈ కార్యక్రమాన్ని సమర్పించారు.

శ్రీ పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ మృదంగం, శ్రీ ఎం.హరిబాబు– ఘటం, శ్రీ ఫణితేజ– సహకార వేణువు. దీటైన సహకార వాద్యాలతో రక్తిగా సాగింది.

కచేరీలోని అంశాలు:

సుఖి ఎవ్వరో– కానడ–త్యాగయ్య

ఎంత ముద్దో– బిందుమాలిని– త్యాగయ్య

పరిపాలయమాం– రీతి గౌళ– స్వాతి తిరునాళ్

నీ వల్ల గుణదోష మేమి – కాపీ–త్యాగయ్య

వరనారద–విజయశ్రీ – త్యాగయ్య

ఓ రంగసాయి– కాంభోజి– త్యాగయ్య

పిబరే రామరసం– చక్రవాకం–సదాశివ బ్రహ్మేంద్ర

మనమే మంత్రాలయ– శుద్ధసారంగ్ – AV కృష్ణమాచార్

సింధుభైరవి రాగంలో లాల్గుడి గారి తిల్లానా

---

# శ్రద్ధాంజలి.



ప్రముఖ గాత్ర విద్వాంసులు, ఆకాశవాణి టాప్ గ్రేడ్ విద్వాంసులు

## శ్రీ మల్లాది నారాయణ శర్మ గారు

28.9.2026 న పరమపదించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని 'గానకళ' శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

# తెలుగు సాంస్కృతిక సమితి, హ్యూస్టన్ స్వర్ణోత్సవ వేడుకలలో "స్వరభారతి" సంగీత కార్యక్రమం





తెలుగు సాంస్కృతిక సమితి, హ్యూస్టన్ వారి స్వర్ణోత్సవ వేడుకలు ఆగస్టు 7, 8 తేదీలలో ఎంతో ఘనంగా జరిగాయి. ఆ వేడుకల్లో భాగంగా ఆగస్టు 8వ తేదీ ఉదయం శోభాయాత్రతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శోభాయాత్రలో స్వరభారతి బృందం నగర సంకీర్తన లో పాల్గొని త్యాగరాజ స్వామివారి ఉత్సవ సాంప్రదాయ కీర్తన "వరలీల గానలోల"ను ఆలపించారు. నిర్వాహకులతోపాటు ప్రముఖులు పూర్ణకుంభాలతో ముందుకు సాగుతుండగా, బృంద సభ్యులు భక్తి శ్రద్ధలతో కీర్తనలు ఆలపిస్తూ ఆ శోభాయాత్రలో భాగమయ్యారు.

ఆ తరువాత స్వాగత గీతం అనంతరం జరిగిన సంగీత విభావరిలో కూడా స్వరభారతికి ప్రత్యేకంగా అవకాశం లభించింది. "శ్రీ సకల గణాధిప" అంటూ శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు రచించిన గణపతి స్తోత్రంతో కార్యక్రమం ప్రారంభించి, అన్నమాచార్య, భద్రాచల రామదాసు కీర్తనలను ఆలపించారు. ఆధ్యాత్మిక భావంతో నిండిన ఆ గీతాలు ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి.

అమెరికా గడ్డపై ఒక తెలుగు సంస్థ తన స్వర్ణోత్సవాన్ని జరుపుకోవడం నిజంగా ఒక అపూర్వమైన ఘట్టం. అలాంటి చారిత్రాత్మక వేడుకల్లో స్వరభారతి బృందాన్ని భాగస్వాములను చేసి, భక్తి సంగీతాన్ని ఆలపించే అవకాశం కల్పించడం ఎంతో గౌరవంగా, మరెంతో ఆనందంగా వుంది అని స్వరభారతి కృతజ్ఞతలు తెలిపింది. శోభాయాత్రలో నగర సంకీర్తనతో మొదలై, సంగీత విభావరిలో అన్నమయ్య, రామదాసు కీర్తనల వరకు—ఈ స్వర్ణోత్సవంలో భాగస్వాములవడం ఈ బృందానికి ఎప్పటికీ మధురమైన జ్ఞాపకం.

–హేమనళిని తల్లావఝ్ఝల





# గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ శేషం రమణగారి ఆధ్వర్యంలో నాదరమణీమ్, వేణుగాన సభ







గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ శేషం రమణగారి ఆధ్వర్యంలో నాదరమణీమ్, వేణుగాన సభ, నాగోల్ వద్ద గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆగస్ట్ 2వ తేది ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గురువులకు స్వర నీరాజనం చేసారు. ముందుగా ఆది శంకర విరచిత రాగమాలికలో గణేశ పంచరత్నం, గౌరీమనోహరి రాగంలో త్యాగరాజ స్వామి రచన గురు లేక ఎటువంటి గుణినికి తెలియకపోదు, గానమూర్తి రాగంలో గానమూర్తే, నాదాతనుమనిశం, రాగమాలికలో చిన్నన్ చిరుకేలియే కృతులు శ్రీ శేషం రమణగారు మరియు వారి శిష్యులు వేణు గానం చేశారు. అనంతరం ప్రముఖ కూచిపూడి గురువు శ్రీమతి శైలజా ప్రసాద్ గారికి, ప్రముఖ భరతనాట్యం గురువు శ్రీమతి సుందరి రవిచంద్ర గారికి, ప్రముఖ వీణా విద్వాంసులు, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, శ్రీ అయ్యగారి శ్యాంసుందరం గారికి గురు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రహ్మ శ్రీ సలాక రఘునాథ శర్మగారు, బ్రహ్మ శ్రీ డా. బాచుపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి గారు విచ్చేసి వారి అశ్శీపూర్వక సందేశం ఇచ్చారు.

తదుపరి గురువులు శ్రీ శేషం రమణ, శ్రీమతి కిడాంబి మైథిలి, శ్రీమతి హేమ, శ్రీ అనంత శౌరి రాజన్, శ్రీ భట్టి పవన్ సింగ్ గార్ల శిష్యులు వేణువు, వీణ మరియు వైయొలిన్ పై పలు కృతులు, కీర్తనలు వాయించి గురువులకు స్వరార్చన చేశారు. లయ సహకారం మృదంగంపై శ్రీచి. అచ్యుతానంద, చి. వేదాంత్, చి. కృష్ణ తేజా సహకారం అందించారు.

అనంతరం సాయంకాలం 6.30 నుండి 9.20 వరకు చెన్నై కి చెందిన విఖ్యాత వేణు గాన విద్వాంసులు శ్రీ శృతి సాగర్ వేణుగాన కచేరితో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. వీరికి సహకారం వయోలిన్ పై కు. గాయత్రి శివాని, మృదంగం పై డా. పి. శ్రీ నివాస గోపాలన్, ఘటం పై శ్రీ హరిబాబు, తంబూర పై చి. అచ్యుతానంద అందించారు.

# విశాఖ మ్యూజిక్ అకాడమీ - విశాఖపట్నం




**బాలమురళీకృష్ణ రచనల పోటీలో కేటగరీ-4 లో ప్రథమ బహుమతి పొందిన కుమారి వ్యాకరణం గాయత్రి విభావరి.**




**బాలమురళీకృష్ణ రచనల పోటీలో కేటగరీ-2 మరియు కేటగరీ -3 లో ప్రథమ బహుమతి పొందిన కుమారి ఐశ్వర్య ప్రసాద్ అయ్యర్.**

విశాఖ మ్యూజిక్ అకాడమీ తన నెలవారీ సంగీత సభలలో భాగంగా, 16-08-26 ఆదివారం నాటి సాయంత్రం, స్థానిక కళాభారతి ఆడిటోరియంలో వైవిధ్యభరితమైన జుగల్బందీ సంగీతసభను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చెన్నయికి చెందిన యువగాయకుడు విద్వాన్ అనిరుధ్ సుబ్రమణ్యన్, నాదస్వర కళాకారుడు విద్వాన్ మైలై కార్తికేయన్ జుగల్బందీ అందించగా మృదంగంపై బెంగళూరుకి చెందిన విద్వాన్ కౌశిక్ శ్రీధర్ మరియు విజయవాడ యువకిశోరం విద్వాన్ మల్లాది శివానంద యశస్వి తమ సహకార లయవాద్య ప్రతిభతో సభను రసమయభరితం కావించారు. ఆరంభంలో శ్రీ వి.యస్.యన్.మూర్తి వాణీప్రార్ధనాశ్లోకంతో ఆహ్వానంపలికి కళాకారుల పరిచయంచేయగా అకాడమీ అధ్యక్షులు శ్రీ కె.వి.రామ్మూర్తి కళాకారులను ఫలప్రదానంతో సత్కరించారు.

సభ నవరాగమాలిక వర్ణంతో మొదలుపెట్టి, మంగళంపల్లి వారి రచన బృందావని తిల్లానాతో ముగించి రెండున్నర గంటల సమయం శ్రోతలను అలరింపజేశారు.

షణ్ముఖప్రియ రాగంలో "సిద్ధి వినాయకం", బిలహరి రాగాలాపనతో "పరిదానమిచ్చితే", శ్రీరంజని రాగంలో "మారుబల్కకున్నావేమిరా" కీర్తనలను ఇరువురు కళాకారులూ సహకారభావంతో ఒకరినొకరు ఉత్సాహపరచుకుంటూ వినిపించారు. మంచి కీరవాణి రాగాలాపనతో స్వరకల్పనలతో ముఖ్యాంశంగా "కలిగియుంటేకదా" అన్న అంశం ప్రేక్షకుల ప్రశంసలనందుకునే స్థాయిలో సాగింది. "మాధవ మామవ దేవా" అంటూ నీలాంబరి రాగంలో భక్తిభరితమైను అంశాన్ని వినిపించి, కాఫీరాగంలో హాయిగా "జో అచ్యుతానంద" అంటూ




**విశాఖ మ్యూజిక్ అకాడమి నిర్వహించిన జుగల్బందీ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ అనిరుధ్ సుబ్రమణ్యన్ మరియు శ్రీ మైలై కార్తికేయన్. మృదంగంపై శ్రీ కౌశిక్ శ్రీధర్ మరియు మల్లాది శివానంద యశస్వి.**

యువకళాకారులందరూ సభను రసమయం చేశారు. యువమార్దంగికులు కనిపించని స్పర్ధతో అందించిన పోటాపోటీ లయవిన్యాసం ఆకట్టుకుంది. డా.పేరాలవారి సమీక్ష ఎప్పటిలాగే మణిప్రవాళంలో సాగి కళాకారుల మనసునింపింది.

అకాడమీ ఒక వినూత్నరీతిలో నాదస్వర – గాత్రయుగళ సంగీతసభను జనరంజకంగా నిర్వహించగలిగింది.

**– వియెస్సెన్మూర్తి**

## విశాఖ మ్యూజిక్ అకాడమీ - విశాఖపట్నం పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచనలగానం పోటీల నిర్వహణ

ఒక మహా వాగ్గేయకారుని రచనలు, అన్నమయ్య రచనలవలె వందలయేళ్ళు "భాండారాన దాగి ఉన్నట్లు" ఉండిపోతే, వాటిని ఎవరో ఒకరు వెలుగులోనికి తీసుకువచ్చే గొప్ప ప్రయత్నమే చేయాలి. అది అన్నమయ్య విషయంలో జరిగింది కాని అందరి విషయంలో జరుగుతుందా? అంటే చెప్పలేము.

గత శతాబ్దపు వాగ్గేయకారునిగా మనం భావించే మన తెలుగు వాడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ. వీరి రచనల స్థాయి, శైలి, పదప్రయోగ వైశిష్ట్యం సాటిలేనివి. అయితే ఎవరైనా పాడితే గదా రసజ్ఞులు అందుకోగలరు. ఈ సదుద్దేశంతో సంగీతం ప్రస్తుతం అభ్యసిస్తున్న తరం ఈ కోణాన్ని కూడా చూడగలిగేలా విశాఖ మ్యూజిక్ అకాడమి గత కొన్ని సంవత్సరాలుగా కేవలం మంగళంపల్లి వారి రచనలపైననే నాలుగు విభాగాలుగా పోటీని నిర్వహిస్తూ, ప్రతి యేటా పోటీ పరిధిని విస్తృతపరుస్తూ, ఈ ఏడాది ప్రపంచస్థాయిలో నిర్వహించింది.

ఎప్పటిలాగే అకాడమీ కార్యదర్శి శ్రీ వి.చంద్రశేఖర్ గారి గృహమే వేదికగా, జూన్ 19-20 తారీకులలో ప్రత్యక్షంగానూ అంతర్జాల మాధ్యమంద్వారాను నిర్వహించిన ఈ పోటీలలో దేశం నలుమూలల నుంచే కాకుండా, కెన్యా, అబుదబీ, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలనుంచి కూడా పోటీదారులు వర్ణాలనూ తిల్లానాలనూ కీర్తనలనూ నేర్చుకొని 50మందివరకూ పాల్గొనడం విశేషం. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డా.మండపాక శారద, డా. ఆర్. మాధురీదేవి, శ్రీమతి వి. లలిత చంద్రశేఖర్ గారల మాటలలో వారికి సంతృప్తిని

కలిగించే రీతిలో గట్టిపోటీనిస్తూ పాల్గొన్నారు పోటీదారులందరు. మైసూర్ నుంచీ ఆన్లైన్ లో కాకుండా ప్రత్యక్షంగా పాల్గొన్న పోటీదారుల ఆసక్తి మెచ్చుకోదగినది.

**బహుమతుల వివరాలిలా ఉన్నాయి**

**కేటగరీ 1 – (12–18 సం.) – ఒకవర్ణం మరియు ఒక కీర్తన – 10ని.**

ప్రథమ బహుమతి – 5000/– భువన అశోక్ (బెంగళూరు)

ద్వితీయ బహుమతి – 3000/– ఒక్కొక్కరికి – పి.వి.పృధ్వీరాజ్ (విశాఖ)

కె.విద్యాకార్తిక (రాజమండ్రి)

తృతీయ బహుమతి – 2000/– ఒక్కొక్కరికి – వి.శ్రీవర్షిణి (హైదరాబాద్)

ఏ.కమలామాన్య (హైదరాబాద్)

ఏ. యాగప్రియ (విశాఖ)

ప్రోత్సాహక బహుమతి – 1500/– కందర్ప శ్రుతి (విశాఖ)

**కేటగరీ – 2 (18–25 సం) – మేళకర్త రాగం లో ఒక కీర్తన మరియు తిల్లానా – 15ని.**

ప్రథమ బహుమతి – 5000/– – ఐశ్వర్య ప్రసాద్ అయ్యర్ (థానె ముంబై)

ద్వితీయ బహుమతి – 3000/– పృథ్వీ భాస్కర్ (మైసూర్)

తృతీయ బహుమతి – 2000/– వడ్లమాని హరిప్రియ (విశాఖ)

**కేటగరీ –3 –(18–35సం.) –మనోధైర్యం ప్రదర్శనతో కీర్తన మరియు తిల్లానా – 20ని.**

ప్రథమ బహుమతి – 8000/– ఐశ్వర్య ప్రసాద్ అయ్యర్ (థానె ముంబై)

ద్వితీయ బహుమతి – 5000/– ఒక్కొక్కరికి – పృథ్వీ భాస్కర్ (మైసూర్)

అభినవ్ కైలాష్ హరిశంకర్ (సిడ్నీ)

**కేటగరీ – 4 – (20–35 సం.) – బాలమురళీకృష్ణ సృష్టించిన రాగంలో RTP – 30ని.**

ప్రథమ బహుమతి – 10000/– వ్యాకరణం గాయత్రి విభావరి (విశాఖ)

తృతీయ బహుమతి – పృథ్వీ భాస్కర్ (మైసూర్)

విజేతలందరికీ వరుసగా ప్రశంసాపత్రం జ్ఞాపిక మరియు కేష్ అవార్డులను, జూలై 6వతేదీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ జన్మదినము నాడు, ప్రత్యేక సభలో అకాడమి అందజేసి సన్మానించింది. ప్రథమ బహుమతి పొందినవారు ఆరోజు వేదికపై గానం వినిపించే అవకాశం కూడా అందుకున్నారు.

ఈపోటీలలో అకాడమి ప్రకటించిన మొదటి బహుమతుల ప్రాయోజకులుగా అకాడమి ప్రెసిడెంట్ ఎమిరటస్ డా.యస్వీ రంగరాజన్, ద్వితీయ బహుమతుల ప్రాయోజకులుగా అకాడమి ఉపాధ్యక్షులు డా.పేరాల బాలమురళీకృష్ణ, తృతీయ బహుమతుల ప్రాయోజకులుగా అకాడమి సహకార్యదర్శి శ్రీ ఎ.భుజంగరావు మరియు శ్రీ

వి.ఎస్.ఎన్ మూర్తి గారలు ముందుకు రావడం విశేషం.

అలాగే ఆ రెండురోజుల్లో వేదికను సకల సదుపాయాలతో అందించిన శ్రీ వి. చంద్రశేఖర్ మరియు శ్రీమతి లలితా చంద్రశేఖర్ గారలకూ, రెండు రోజులూ, పాల్గొన్న పోటీదారులకూ, ప్రేక్షకులతో పాటు అందరికీ విందుభోజనం అందించిన శ్రీ వి.ఎస్.ఎన్. మూర్తి గారికీ అకాడమి ధన్యవాదాలు తెలియజేసింది.

వచ్చేఏడు నిర్వహణలో మరిన్ని నిర్మాణాత్మక సూచనలను న్యాయనిర్ణేతలు సూచించడం గమనార్హం.

– వియెస్సెన్మూర్తి

## విశాఖ మ్యూజిక్ అకాడమీ - విశాఖపట్నం

కేంద్ర సంగీత నాటక అకాడమీ, ప్రఖ్యాత కర్ణాటక సంగీత గాయని డా. పంతుల రమ గారికి తమ ప్రతిష్ఠాకరమైన పురస్కారాన్ని ప్రకటించిన ఉత్తర క్షణంలోనే, విశాఖ మ్యూజిక్ అకాడమీ స్పందించి విశాఖ రసజ్ఞుల ఆనందాన్ని తెలియజేయడానికై తే.28.6.26 నాటి సాయంత్రం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఆమెను ఘనంగా సన్మానించి తన బాధ్యతను నిర్వర్తించింది.

శ్రీ వి.యస్.యన్.మూర్తి గారు, గానసరస్వతి సన్మానసభకు తగినరీతిలో, "యయా వినా జగత్సర్వం శశ్వజ్జీవన్మృతం భవేత్" అంటూ సరస్వతిని ప్రార్థించి, అకాడమీ అధ్యక్షులు శ్రీ కె.వి. రామ్మూర్తి, కార్యదర్శి శ్రీ వి.చంద్రశేఖర్ , ముఖ్య అతిథిగా విశాఖ మ్యూజిక్ & డాన్స్ అకాడమీ కార్యదర్శి డా.జి ఆర్.కె.ప్రసాద్ (రాంబాబు), గౌరవ అతిథిగా ప్రఖ్యాత గాయనీమణి డా. మండపాక శారద, పురస్కార గ్రహీత డా. పంతులరమ గారలను వేదికపైకి ఆహ్వానించి సభను ఆరంభించారు.

అధ్యక్షులు మరియు అతిథుల సందేశాలనంతరం, పంతుల రమగారు ప్రత్యేక ఆసనం గ్రహించగా, శ్రీమతి సునీతా కుమార్, శ్రీమతి రత్నకుమారి రమగారికి చందన కుంకుమాదులతో అలంకరించిన పిదప డా. జి.ఆర్.కే.ప్రసాద్ శాలువతోనూ, డా.మండపాక శారద పుష్పమాలతోనూ, కోశాధికారి శ్రీ సి.హెచ్. దుర్గాప్రసాద్ చందనమాలతోనూ, సహకార్యదర్శి భుజంగరావు ఫలములతోనూ, రమగారిని సన్మానించిన అనంతరం అధ్యక్షులు శ్రీ కె.వి. రామ్మూర్తి, కార్యదర్శి శ్రీ వి. చంద్రశేఖర్ అందమైన జ్ఞాపికను అందించారు.

విశాఖలో వివిధ సంస్థలు, సంగీతజ్ఞులు కూడా యథోచిత సత్కారం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నాయి. అనంతరం కృతజ్ఞతా పూర్వకంగా, తగిన విధంగా స్పందించి పంతుల రమ , ప్రథమంగా ఈ సందర్భంగా అకాడమీ సన్మానించడం సంతోషదాయకమన్నారు. అధ్యక్షులు అతిథులను తగురీతిని సత్కరించాక సభను తమ ధన్యవాద సమర్పణతో శ్రీ వి.యస్.యెన్.మూర్తి గారు

ముగించారు.

అనంతరం డా.పంతుల రమ, వాయులీనంపై విద్వాన్ MSN మూర్తి, మృదంగంపై విద్వాన్ జి.వెంకటరావు, తంబురా శ్రుతితో శ్రీ సాకేత్ పంతుల సహకరించగా, వీనుల విందయిన గానంతో రసజ్ఞులను ఆనందలోకాలలో విహరింపజేశారు. జగన్మోహిని రాగంలో "శోభిల్లు సప్తస్వర" అంటూ స్వరసుందరులను భజించి, సామ రాగంలో "అన్నపూర్ణే విశాలాక్షి" అంటూ అమ్మగారిని వేడుకొని, అరుదైన నిరోష్ఠ రాగంలో "రాజరాజరాజితే" అన్న ముత్తయ్య భాగవతార్ రచనను వినిపించారు గాయని. ముఖ్యాంశంగా చిక్కనైన తోడి రాగాలాపనతో "దాశరథే నీ రుణము" కీర్తన మనోహరంగా ఆలపించి , మధుకౌంస్ రాగంలో అన్నమయ్యరచన "ఎంత అందముల" అన్న పదమునూ, అరుదైన శ్రీమాన్ ఎన్.సి.హెచ్.కృష్ణమాచార్యులవారి ఆనందభైరవి రాగ రచన "అందము ఆనందము రామానుజార్య సంబంధము" అన్న అంశంతో ప్రేక్షకుల కరతాళ ధ్వనులమధ్య సభను ముగించారు. వాయులీనంపై శ్రీ ఎమ్మెస్సెన్ మూర్తి తనదైన శైలిలో అలవోకగా, రాగభావాన్ని పలికిస్తూ, స్వరకల్పనలలో ప్రతిభను చూపుతూ సహకారం అందించగా, మృదంగంపై శ్రీ జి. వెంకటరావు మృదువైన వాద్యంతోనూ, సహకారధర్మాన్ని పాటిస్తూ, సభను రక్తికట్టించడంలో దోహదకారిగా నిలిచారు.

అనంతరం విశాఖలో మరియొక కేంద్రీయ సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత, మధురగాయని శ్రీమతి మండ సుధారాణి గారి సమీక్ష ఎన్నో పాత జ్ఞాపకాలను గుర్తుచేస్తూ, గురువులను స్మరించుకుంటూ మంచి అనుభూతి నిచ్చింది.

– వియెస్సెన్మూర్తి

## విశాఖ మ్యూజిక్ అకాడమి - విశాఖపట్నం
## పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ స్మారక పురస్కార ప్రదానోత్సవం

విశాఖ మ్యూజిక్ అకాడమి ప్రతియేటా సమర్పిస్తున్న పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ స్మారక పురస్కారాన్ని ఈ ఏడాదికిగాను, విజయవాడకు చెందిన ప్రఖ్యాత గాత్రం విద్వాంసుడు, మంగళంపల్లివారి శిష్యుడు అయిన శ్రీ డి.వి.మోహనకృష్ణ గారికి సమర్పించింది. ఈ సందర్భంగా తే.06.07.26 నాటి సాయంత్రం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో సన్మానసభ, వెంటనే మోహనకృష్ణ గాత్రసంగీత సభ రసికజనరంజకంగా జరిగాయి.

ఈ సన్మాన సభకు ముందు అకాడమీ జూన్ 19-20 తేదీలలో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్షంగా మరియూ అంతర్జాల మాధ్యమంద్వారా నిర్వహించిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచనలపై నాలుగువిభాగాల పోటీల్లో ప్రథమబహుమతి నందుకున్న విజేతలు తమతమ అంశాలను

వినిపించడం జరిగింది.

సరిగ్గా సాయంత్రం 4.30 గం.కు, మొదటి విభాగంలో (12-18సం) విజేత రాలేక పోగా, 2-3 విభాగాలలో ప్రథమ బహుమతి సాధించిన కుమారి ఐశ్వర్య ప్రసాద్ అయ్యర్ (ముంబయి) , 4వ విభాగమైన "బాలమురళీకృష్ణ గారు సృష్టించిన రాగంలో 'రాగం తానం పల్లవి' పోటీలో విజేతగా నిలచిన విశాఖకు చెందిన కుమారి వ్యాకరణం గాయత్రి విభావరి, తమతమ అంశాలను ప్రతిభావంతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

అనంతరం ప్రకటించిన 6.00గం.కు, బాలమురళీకృష్ణ పేరుతో మోహనకృష్ణ కు అవార్డు అందజేస్తున్న సభలో - "పసిడి వెన్నెలమించు పట్టవస్త్రపుటంచు " అంటూ సకలకళాస్వరూపుడైన శ్రీకృష్ణుని స్తుతించి - శ్రీ వి.యస్.యన్.మూర్తిగారు అవార్డు పూర్వాపరాలు తెలియజేశారు. అనంతరం అకాడమి సహకార్యదర్శి శ్రీ యమ్. జ్వాలాప్రసాద్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పురస్కార గ్రహీత శ్రీ డి.వి.మోహనకృష్ణగారు ప్రత్యేక ఆసనం గ్రహించాక, వారికి శ్రీ ఎ.భుజంగరావు మరియు శ్రీ సి.హెచ్.దుర్గాప్రసాద్ చందనకుంకుమాదులతో, ప్రెసిడెంట్ ఎమిరటస్ డా.యస్వీ రంగరాజన్ గారు పుష్పమాలతో, అధ్యక్షులు శ్రీ కె.వి.రామ్మూర్తిగారు శాలువతో, కోశాధికారి శ్రీ సి.హెచ్.దుర్గాప్రసాద్ గారు చందనమాలతో, సహకార్యదర్శి శ్రీ ఎ. భుజంగరావు గారు ఫలములతోనూ మోహనకృష్ణను ప్రేక్షకుల కరతాళ ధ్వనులమధ్య సన్మానించారు.

ఆనంతరం శ్రీ వి.యస్.యన్.మూర్తి , మోహనకృష్ణగారి సంగీతప్రయాణ వివరాలతో తాను రూపొందించిన సన్మానపత్రం పఠించిన అనంతరం, కార్యదర్శి శ్రీ వి.చంద్రశేఖర్ సన్మానపత్రాన్ని సన్మానగ్రహీతకు అందజేయగా ఉపాధ్యక్షులు శ్రీ బి.ఏ.రాజారావుగారు జ్ఞాపికను సమర్పించారు. మోహనకృష్ణ గారు తన స్పందనలో తెలియజేసిన విషయాలు, గురువుగారితో తన అనుభవాలు ప్రేక్షకులతో పంచుకున్నారు.

తరువాత ముందు అకాడమీ నిర్వహించిన పోటీలలో న్యాయనిర్ణేతలుగా బాధ్యతను నిర్వహించిన డా. మండపాక శారద, డా. ఆర్. మాధురీదేవి, శ్రీమతి లలితా చంద్రశేఖర్ గారలను సన్మానించి,విజేతలందరికీ, వరుసగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక మరియు కేష్ అవార్డులను అతిథుల చేతులమీదుగా అకాడమీ అందజేసింది.

శ్రీ వి.యస్.ఎన్.మూర్తిగారు పోటీలలో నలుమూలలనుంచి పాల్గొన్న పోటీదారులకూ, న్యాయనిర్ణేతలకూ, వారి గృహమునే వేదికగా నందించిన వి.చంద్రశేఖర్ గారికి, పోటీ రెండురోజులూ అందరికీ భోజనసదుపాయం కలిగించిన దాతలకూ, ధన్యవాదాలు తెలియజేసి సన్మానసభను ముగించారు

అనంతరం వాయులీనంపై విద్వాన్ పెరవలి నందకుమార్, మృదంగంపై శ్రీ పెరవలి జయభాస్కర్

, గాత్రంతో శ్రీ రమాకాంత్ సహకరించగా శ్రీ డి.వి. మోహనకృష్ణ తనదైన శైలిలో గురువుగారి రచనలను పాడుతూ వివరిస్తూ వీనులవిందు చేశారు.

ముఖ్యంగా గురువుగారి రచనను గానంచేస్తూ, మరికొన్ని రచనలను సాహిత్యపరంగా వివరించడం గురువుగారికి గొప్పనివాళిగా విశేషంగా ఆకట్టుకుంది. గంభీరనాట రాగంలో "అమ్మా ఆనందదాయిని" పదవర్ణంతో ఆరంభించి, గణపతి రాగంలో "గం గణపతి", మోహనాంగి రాగంలో "నీగానము నా జీవము", బిలహరి రాగంలో "సింహాచలమున వెలసిన", హిందోళ రాగంలో "గానరసికే" అంటూ బాలమురళీకృష్ణ గారి రచనలు వినిపించారు. చివరిగా గురువుగారికి నివాళిగా స్వీయరచనను "అక్షరాంజలిదే అందుకొనుమా" అంటూ సభను ముగించారు మోహనకృష్ణ. స్వరాక్షరాలతో కూడి భావయుక్తమైన రచనల సంగీత స్వరాలను వాయులీనంపై శ్రీ పెరవలి నందకుమార్ పలికించగా, మృదంగంచేత పాడించిన ఘనత శ్రీ పెరవలి జయభాస్కర్ గారిదే.

మంచి జ్ఞాపకాలను రసజ్ఞులకు అందించిన మోహనకృష్ణ అభినందనీయులు.

**– వియెస్సెన్మూర్తి**

## విశాఖ మ్యూజిక్ అకాడమి - విశాఖపట్నం వాగ్గేయకార ఉత్సవాలు - 2026

విశాఖ మ్యూజిక్ అకాడమి, వాగ్గేయకారుల పట్ల, వారందించిన సాహిత్యం పట్ల ఎనలేని గౌరవంతో, వాగ్గేయకారత్రయమే కాకుండా ఎందరో సంస్కృతాంధ్ర భాషలలో వెలయించిన అపురూపమైన సాహిత్యం, సంగీతజ్ఞుల ముఖ్యంగా నేటి యువతరం దృష్టికి తీసుకురావాలన్న గురుతర బాధ్యతను, చేపట్టి మొదటిసారిగా విశాఖలో గతయేడాది, వాగ్గేయకార ఉత్సవాలు – 2025 ను, ఆశించిన దానికన్నా అధికమైన రసజ్ఞుల ఆదరణతో ఘనంగా నిర్వహించింది. అదేస్ఫూర్తితో ఈ ఏడాదికి గాను వాగ్గేయకారులైన శ్రీయుతులు క్షేత్రయ్య, పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, మరియు అన్నస్వామి శాస్త్రి (శ్యామశాస్త్రివర్యుల మనుమడు. సుబ్బరాయ శాస్త్రి గారి దత్త పుత్రుడు ) గారలను అకాడమి ఎన్నుకొని, వారివి ఒక్కొక్కరివి పది రచనలు చొప్పున 30రచనలను కళాకారులను పాడవలసినదిగా కోరడం – వారు అంగీకరించి శ్రీమతి లలితా చంద్రశేఖర్ వంటి సీనియర్ విద్వాంసులు కూడా సాధనచేసి సహకరిస్తూ పాడడం జరిగింది.

ఈ వాగ్గేయకార ఉత్సవాలను ఈ ఏడాది జూలై 4–5 తేదీలలో స్థానిక కళాభారతి ఆడిటోరియంలో సాయంత్రం 4గం. నుండి రాత్రి 9.00వరకూ, అధికమైన రసజ్ఞుల ఆదరణతో అకాడమి విజయవంతంగా నిర్వహించింది.

గత సంవత్సరం లాగే అకాడమి ముందుగా సూచించినట్లు ఆ రెండు రోజులూ,

4–5 గం వరకూ జూనియర్ కళాకారులు ముగ్గురు వాగ్గేయకారుల రచనలను ఒక్కొక్కటి పాడుతూ, 5–6.30 గం. సబ్ సీనియర్ కళాకారులు ఒక్కొక్కరివీ రెండేసి రచనలనూ, 6.45 నుండి 9.00

గం. వరకూ సీనియర్ కళాకారులు కూడా అలాగే రెండేసి రచనలనూ పాడుతూ, నియమం అందరూ పాటిస్తూ, వారికి మిగిలిన సమయంలో స్వేచ్ఛగా అంశాలను పాడుకుంటూ సభలను రక్తికట్టించడం గొప్పవిషయంగా ప్రేక్షకుల కరతాళధ్వనుల స్పందన తెలియజేసింది.

4.7.26 నాటి సాయంత్రం సరిగ్గా 4.గంకు అకాడమి సహకార్యదర్శి శ్రీ మంథా జ్వాలాప్రసాద్ గారు స్వాగత వచనాలు పలికి, వాగ్గేయకార ఉత్సవాల పూర్వాపరాలను తెలియజేసి, అధ్యక్షులు శ్రీ కె.వి.రామ్మూర్తి, కార్యదర్శి శ్రీ వి.చంద్రశేఖర్, సహకార్యదర్శి శ్రీ ఏ.భుజంగరావు మరియు శ్రీ వి.ఎస్.ఎన్.మూర్తి గారలను వేదికపైకి ఆహ్వానించి, శుభారంభం కలుగజేస్తూ జ్యోతిప్రదీపన కార్యక్రమం నిర్వహించారు.



మొదటి కచేరీ, కుమారి ఆర్ కృష్ణప్రియ గానం – వాయులీనంపై యన్.వి.ఎన్.కృష్ణప్రియ, మృదంగంపై శ్రీ సి.హెచ్.చాణక్యచంద్ర, శ్రుతితో కుమారి అయ్యన్ ప్రణతి సహకరించగా గంటసేపు ప్రేక్షకులను అలరించింది. కృష్ణప్రియ గణేశ ప్రార్థన షణ్ముఖప్రియ రాగంలో "సిద్ధివినాయకం" తో ఆరంభించి, బేగడరాగంలో పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "అభిమాన మెన్నడు", విజయశ్రీ రాగంలో "వరనారద", భైరవి రాగంలో అన్నస్వామి శాస్త్రి రచన "శ్రీలలితే మహాత్రిపుర సుందరి" అంటూ ముఖ్యాంశం వినిపించి, కాపీ రాగంలో క్షేత్రయ్య రచన "ఇన్నాళ్లు తెలియనైతి" అంశంతో సభను ముగించారు. ముగ్గురు కళాకారులు రాగాలాపనలలో స్వరకల్పనలలో లయవిన్యాసంలో తమతమ ప్రతిభను ప్రదర్శించారు.



తరువాత రెండవ సభలో సబ్ సీనియర్ విభాగంలో శ్రీమతి ఇవటూరి జగదాంబ గారి గానం, వాయులీనంపై శ్రీ సరస్వతుల పార్థివ, మృదంగంపై శ్రీ ఎమ్. కామేష్ సహకరించగా మధురంగా సాగింది. శ్రీమతి జగదాంబ ఆనందభైరవి రాగంలో "రాగరత్నమాలికచే" అన్న అంశంతో ఆరంభించి, వరుసగా బౌళి రాగంలో క్షేత్రయ్య రచన "కోడికూసెనయ్యో", కాంభోజి రాగంలో అన్నస్వామి శాస్త్రి రచన "శ్రీ కామేశ్వర", లతాంగి రాగంలో పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "అపరాధము", అఠాణా రాగంలో "అనుపమ గుణాంబుధి" కీర్తనలు వినిపించారు. అనంతరం ముఖ్యాంశంగా పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "నీ పాదములే గతి", క్షేత్రయ్య రచన మోహనరాగంలో " మగువ తన కేళిక", తిల్లానాలతో సభను ముగించారు జగదాంబ. సీనియర్ సహకారవాద్య కళాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.





తరువాత మూడవ సభలో సీనియర్ విద్వాంసులు విద్వాన్ ఆకొండి శ్రీనివాస రాజారావు గారు వాయులీనంపై శ్రీ సుసరాపు లక్ష్మీగణపతి శర్మ వాయులీనంపై, శ్రీ కె. యోగీష్ మృదంగంపై సహకరించగా జనరంజకమైన గానంతో ఆనందపరిచారు. సౌరాష్ట్ర రాగంలో "గజాననయుతం" అంటూ ఆరంభించి, అఠాణా రాగంలో అన్నస్వామి శాస్త్రి రచన "పరమపావని", మలయమారుత రాగంలో పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "ధన్యుడెవ్వడో", సావేరి రాగంలో క్షేత్రయ్య రచన "లేమరో", మణిరంగు రాగంలో " రానిది రాదు", శహన రాగంలో అన్నస్వామి శాస్త్రి రచన "ఇంకెవరున్నారు", రవిచంద్రిక రాగంలో "మాకేలరా", భైరవి రాగంలో క్షేత్రయ్య పదం "ముందటివలె నాపై" అన్న అంశాలను వరుసగా వినిపించారు రాజారావు గారు. ముఖ్యాంశంగా కల్యాణి రాగంలో పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "నిజదాస వరద" కీర్తనను, అనంతరం ఆహిరి రాగంలో "సొంపైన మనసుతో" అన్న రచనలతో సభను ముగించారు. ఆసాంతం చక్కని రాగాలాపనలతో చిక్కని స్వరకల్పనలతో తన పాండిత్యాన్ని ప్రదర్శించి ప్రశంసాపాత్రులయ్యారు ఈ సీనియర్ విద్వాంసులు.

5-7-26 నాటి సాయంత్రం శ్రీ జి.వేణుగోపాల రావు గారి స్వాగత వచనాలతో సరిగ్గా 4.గం.కు కుమారి కర్రా నాగవైష్ణవి, వాయులీనంపై కుమారి కె. గాయత్రి వరేణ్య, మృదంగంపై శ్రీ పి.వి.యస్ .బాలాజీ యువరాజ్ గారల సహకారంతో గానం శారదాదేవిపై శ్లోకంతో ఆరంభించారు. పంతువరాళి రాగంలో "వాడేరా దైవము", కన్నడ రాగంలో పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "ఇంతకంటె కావలెనా", సారంగ రాగంలో అన్నస్వామి శాస్త్రి రచన "శ్రీ కామాక్షి", అభేరి రాగంలో "వీణాభేరీవేణువాద్య", అంశాలు వినిపించారు ముఖ్యాంశంగా భైరవి రాగంలో "సరియెవ్వరమ్మా" వినిపించి శంకరాభరణరాగంలో క్షేత్రయ్య రచన "ఎవ్వరే ఎవ్వరే" అంటూ సభను ముగించారు. ముగ్గురు కళాకారులు తమతమ విద్వత్తును ఘనంగా ప్రదర్శించి మంచి భవిష్యత్తు గలదని చాటి చెప్పారు



తరువాత సబ్ సీనియర్ విభాగంలో శ్రీ బంకుపల్లి విద్యాసాగర్ గారు వాయులీనంపై శ్రీ జె.చంద్రమౌళి, మృదంగంపై శ్రీ సుసరా నేనుపు

సుబ్రహ్మణ్యం గారలు అనుసరించగా తమ గానం వినిపించారు. వీణావాదిని రాగంలో "శ్రీ గణేశాయ" అంటూ ఆరంభించి, వరుసగా సౌరాష్ట్ర రాగంలో పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "నిన్నుజూచి", హుసేని రాగంలో క్షేత్రయ్య పదం "వాడలిగితే", మధ్యమావతి రాగంలో అన్నస్వామి శాస్త్రి రచన "వాంఛితవరదే", నాగస్వరావళి రాగంలో పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "గరుడగమన", అంశాలనందించి, ముఖ్యాంశంగా కల్యాణి రాగంలో అన్నస్వామి శాస్త్రి రచన "శ్రీ కాంచీపుర వాసినీ" అన్న అంశాన్ని హాయిగా వినిపించి, కేదారగౌళ రాగంలో క్షేత్రయ్య రచన "భామరో" అన్న పదంతో ముగించారు.



మూడవసంగీతసభ ముఖ్యంగా ఈ ఉత్సవాలను సుసంపన్నం చేయబోయే గాత్రసంగీతసభను విదుషి శ్రీమతి లలిత చంద్రశేఖర్, వాయులీనంపై విద్వాన్ హెచ్.రామచరణ్ , మృదంగంపై విద్వాన్ మెహర్ సాగర్, మరియు శ్రీమతి లక్ష్మీశారద గారి గానసహకారంతో శ్రవణపేయంగా అందించి ఉత్సవాలకు మంచి ముగింపును చేకూర్చారు.

అసావేరిరాగంలో అన్నస్వామి శాస్త్రి రచన "శ్రీ కాంచినాయకే" తో ఆరంభించి తరువాత బిలహరి రాగంలో అన్నస్వామివారి రచనే "మహారాజ్ఞి" వినిపించి వరుసగా ఆనందభైరవి రాగంలో "మానసగురుగుహ" , కేదారం రాగంలో పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "సమయమిదే", అఠాణా రాగంలో క్షేత్రయ్య పదం "ఎవతె తాళునమ్మ", శంకరాభరణ రాగంలో "సరోజదళనేత్రి" కీర్తనలను వినిపించి ముఖ్యాంశంగా గంభీరమైన పంతువరాళి రాగాలాపన స్వరకల్పనలతో "అప్పరామ భక్తి" అంశంతో ప్రేక్షకుల ప్రశంసలనందుకొని, ఖమాస్ రాగంలో పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచన "అపుడు మనసు", నీలాంబరి రాగంలో క్షేత్రయ్య రచన "ఎటువంటి వాడే" అన్న లలితమైన అంశాలతో సభను, ఉత్సవాలను ముగించారు శ్రీమతి లలితా చంద్రశేఖర్.

రెండురోజుల్లోనూ కచేరీకి కచేరీకి మధ్య లభించే కాస్త సమయంలో అకాడమీ ఎన్నుకున్న వాగ్గేయకారత్రయం గురించీ వారి సాహిత్య వైశిష్ట్యం గురించి శ్రీ వి.యస్.యన్. మూర్తిగారు అందించిన విశేషాలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులనందుకోవడం విశేషం. ఈ రెండు రోజుల సభలలో సుమారు 20మంది కళాకారులు పాల్గొన్నారు. 50కిపైగా రచనలను వినిపించడమూ కొత్తరచనలను పరిచయం చేయడమూ గమనార్హం.కార్యక్రమంలో ప్రతి నిముషం కార్యవర్గ సభ్యుల క్రమశిక్షణ మరియు ముఖ్యంగా కార్యదర్శి శ్రీ వి. చంద్రశేఖర్, సహకార్యదర్శులు శ్రీ ఎ.భుజంగరావు మరియు యమ్. జ్వాలాప్రసాద్ గారల శ్రమ కనిపిస్తూనే ఉంది. సభానంతరం అందరికీ ప్రసాదవితరణ కూడా మంచి ఫలితాన్నిచ్చింది.

**వియెస్సెన్మూర్తి**

## శుభగాత్రి ఆర్ట్స్ అకాడెమీ"గుంటూరు.



గుంటూరులోని డా.మంగళంపల్లి బాలమురళీ కృష్ణప్రభుత్వసంగీతవిద్యాలయంలో నాట్యగురువుగా ఎందరో విద్యార్థులకు శిక్షణ ఇవ్వటమే కాక, ఒక అత్యున్నత మృదంగ కళాకారునిగా లబ్ధప్రతిష్ఠులైన సంగీత విద్వాంసులకు సహకారం అందిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్న శ్రీ బీరక సురేష్ బాబు ఆధ్వర్యంలోపై సంస్థ రెండవ వార్షికోత్సవం 23-8-2026 జరిగింది.

సుమారు వందమంది చిన్నారుల చక్కని నృత్య ప్రదర్శన, అనంతరం మోదుముడి సుధాకర్ గారి గాత్ర కచేరి జరిగింది.

విద్యావంతులు శ్రీ చింతపల్లి ఉదయకుమార్, త్యాగరాజ కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకులు శ్రీ కృష్ణ కిశోర్, హరికథకులు శ్రీ తుర్లపాటి శంభయాచార్యులు తదితరులు సభలో పాల్గొన్నారు.

శ్రీ సురేష్ బాబు, తన మృదంగ గురు పరంపరకు, తనను పెంచి పెద్దచేసిన సంగీత విదుషి కీ.శే. దేవన సుభద్ర గార్లకు భక్తి పూర్వకంగా ఈ వార్షికోత్సవాన్ని అంకితం చేస్తూ ఒక సత్సంప్రదాయాన్ని ఈతరం కళాకారులకు పరిచయం చేశారు.

విశేష సంఖ్యలో కళాకారులు, సంగీత ప్రియులు విచ్చేసిన ఈ కార్యక్రమం, ఒక సత్సంకల్పానికి తిరుగులేదని నిరూపిస్తూ అత్యంత వైభవంగా జరిగింది.తొలుత బీరక సురేష్ బాబు గారి శిష్యప్రశిష్యులు నాట్య ప్రదర్శన చేశారు, అనంతరం, మోదుముడి సుధాకర్ గాత్రం, పెరవలి నందకుమార్ వయొలిన్, బి. సురేష్ బాబు మృదంగం పై సహకరించగా కచేరి ఆద్యంతం రక్తి గా సాగింది. అనంతరం మోదుమూడి సుధాకర్ దంపతులను అకాడమీ వారు ఘనంగా సన్మానించారు.

## శ్రీ కంచి కామకోటి శంకర మఠం మరియు శ్రీ విజయత్యాగరాజ సంగీతసభ - విశాఖపట్నం



శ్రీ కంచి కామకోటి శంకరమఠం మరియు శ్రీ విజయ త్యాగరాజ సంగీత సభ సంయుక్తంగా విశాఖపట్నం శంకరమఠం వేదికగా తే17.08.26ది సాయంత్రం,ప్రఖ్యాత గాత్రవిద్వన్మణి కీ.శే.శ్రీమతి శిష్ట్లా వసుంధరా దేవి గారి సంస్మరణ సందర్భంగా ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆ మహా సంగీతజ్ఞురాలి సంస్మరణలో కుమారి ఇవటూరి కృష్ణశృతి గాత్రసంగీత సభను ఏర్పాటు చేశారు. వసుంధరా సంగీతబృందం ఈ కార్యక్రమం

సమర్పించడం ఎన్నదగిన విషయం.

ముందుగా శ్రీ మంథా జ్వాలాప్రసాద్ ఆహ్వానం పలికి జ్యోతిప్రచోదనం చేయడానికి శ్రీమతి రోహిణి, శ్రీయుతులు పేరాల బాలమురళీకృష్ణ, శ్రీ అయ్యగారి భుజంగరావు, శ్రీ వి.ఎస్.ఎన్.మూర్తి మరియు కార్యదర్శి శ్రీ చాగంటి శర్మ లను వేదికపైకి ఆహ్వానించారు.

"అద్వైత సిద్ధాంతమూలమ్" అంటూ శ్రీ వి.ఎస్.ఎన్.మూర్తి శంకరాచార్య ప్రార్థనచేసి శ్రీమతి వసుంధరాదేవి సంగీత ప్రస్థాన విశేషాలను తెలియజేస్తూ, ఆమె ఒక గొప్ప విద్యాంసురాలేకాక గొప్ప గురువుగా, ఆకాశవాణిలో ఎన్నో కార్యక్రమాల రూపకల్పన చేసిన సంగీతజ్ఞురాలిగా తెలియజేసి నాటి కళాకారుల పరిచయం చేశారు.

కళాకారులకు శ్రీమతి శిష్ట్లా వసుంధరాదేవి తనయులైన శ్రీ శిష్ట్లా సత్యనారాయణ వారి కుటుంబ సభ్యులు ఫలప్రదానంతో సత్కరించిన అనంతరం కుమారి కృష్ణశృతి కల్యాణి అటతాళ వర్ణంతో సభను ఆరంభించారు. గౌళరాగంలో "ప్రణమామ్యహం" అంటూ గణపతిని స్తుతించి, శ్రీరంజని రాగంలో "సొగసుగా మృదంగతాళము", అఠాణ రాగంలో అరుదైన "చెడే బుద్ధిమానురా" అన్న కీర్తనను జనరంజకంగా వినిపించారు గాయని. సావేరి రాగంలో అరుదుగా వినిపించే "రామబాణ త్రాణశౌర్యము" , జింగ్లా రాగంలో "అనాథుడను కాను", అంశాల అనంతరం కల్యాణి రాగం తానం తో "కామాక్షి నీరజాక్షి నిఖిలలోక సాక్షి కల్యాణి" అన్న ద్వినడపల్లవిని చతురశ్రజాతి త్రిపుటతాళంలో రాగమాలికగా లలిత, రంజని, భైరవి రాగాలలో మనోహరమైన విద్వత్ప్రదర్శనతో గానంచేసి ప్రశంసల నందుకొన్నారు. తరువాత గురువుగారైన శ్రీ ఎమ్మెస్సెన్ మూర్తిగారు స్వరపరచిన అన్నమయ్య రచన "జయజయ నృసింహ" సింధుభైరవి రాగంలో వినిపించి సుసంపన్నం కావించారు కృష్ణశృతి. తన రాగాలాపనలమాధుర్యంతో స్వరకల్పనాచాతుర్యంతో మంచి భవిష్యత్తు కలదని తెలియజేశారు గాయని.

వాయులీనంపై శ్రీ సరస్వతుల పార్థివ, మృదంగంపై శ్రీ చరిత్ తమ సమయోచిత సహకారంతో గాయనిని అనుసరిస్తూ, అవకాశం అందినవేళ స్వీయ ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నారు.

డా. పేరాల బాలమురళీకృష్ణ గారి విపులమైన సమీక్షతో ప్రేక్షకులకు మంచి సంగీతసభను విన్న అనుభూతి కలిగింది.

**– వియెస్సెన్మూర్తి**

**వీణ నేర్చుకోవాలనుకుంటున్నారా!**
**వీరిని సంప్రదించవచ్చు.**



**Rayaprolu Sudhakar, MA Music**
**Double B High Grades in Veena from AIR Hyderabad, Disciple of Veena Vidwan Sri D Srinivas, Working as Veena Faculty, Andhra Mahila Sabha fine Arts college Hyderabad, Taking Online and Offline Veena Classes, Contact No +919848098593**

# శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు.



శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు వారి నెలవారీ కార్యక్రమాలలో భాగంగా 29 ఆగష్టు శనివారం సాయంత్రం లక్ష్మీపురం మెయిన్ రోడ్ గుంటూరు లోని శ్రీ త్యాగరాజ మందిరము నందు శ్రీ దీవి రవికాంత్ (హైదరాబాదు)గాత్ర కచేరి జరిగినది.దీనికి వాయులీనంపై శ్రీ షణ్ముఖ శ్రీవత్స–హైదరాబాదు; మృదంగంపై శ్రీ బీరక సురేష్, గుంటూరు, వారు సహకారాన్నందించిరి.

కార్యక్రమం లో ముందుగా గోపాలక పాహిమామ్, రేవగుప్తి రాగంలో స్వాతితిరు నాళ్ల రచనపాడి, ఆందోళిక లో రాగసుధారస అనుత్యాగయ్య గారి కీర్తన రక్తిగా సాగాయి. తదుపరి భోగీంద్రశాయినం కుంతలవరాళి, ఆనంద భైరవిలో 'మానస గురుగుహ ' దీక్షితుల వారిరచన సంప్రదాయ శుద్ధంగా వినిపించారు. పిమ్మట ఉపప్రధా నాంశం గ మాయామాళవ గౌళ రాగం లొ 'మేరుసమాన' త్యాగరాజ కృతి గానంచేసి రక్తికట్టించారు. తదుపరి శ్రీపతే నీపద నాగస్వరావళి లొ అరుదయిన రచన పాడి స్వర్గీయ శ్రీ KV నారాయణ స్వామి గారిని స్ఫురణకు తెచ్చేరు.(KVN. గారికి PAT-ENT కీర్తన యిది,)ఆపై 'ఒకపరి జూడగా' కళావతి రాగం లో మరొక అపురూప త్యాగరాజ రచన పాడి,ప్రధానాంశంగా లతాంగి లో 'మరివేరేదిక్కెవ్వరు' పట్నం సుబ్రహ్మణ్య అయ్యరు గారి రచన ఎన్నుకున్నారు. లతాంగి రాగం ప్రధానం గా పాడటం చాలా అభినందించ దగ్గ విషయమే !కాని, రాగాలాపన తదితర మనోధర్మ అంశాలు మరింత పట్టుగా వుంటే బాగుండుననిపించింది. లతాంగి అంశం ప్రధాన అంశంగా తీసుకోవడం సాహసమే! వాయులీనం పై శ్రీవత్స తన శక్తి మేరకు సహకరించారు, సురేష్ బాబు గారి మృదంగం కార్యక్రమానికి వన్నె తెచ్చింది. మృదు గంభీరమైన తన్యావర్తనం శ్రోతల మన్ననలు పొందింది. ముగింపుగా అసావేరి లో రారమాయింటిదాకా, నీలమేఘశరీర, మోహన తరంగం సింధుభైరవి లో దాసరపదం తో కచేరి ముగిసింది. కచేరి అంశాల ఎంపిక ఆకర్షణీయంగా ఉంద నిపించింది.

నాటియీా కార్యక్రమం సభ స్థలదాత స్వర్గీయ కుమారి జమ్మలమడక బాలత్రిపురసుందరి, స్వర్గీయ విదుషి కుమారి శ్రీరంగం గోపాలరత్నం మరియు స్వర్గీయ –విద్వాన్ బ్రహ్మశ్రీ శ్రీ నేతి శ్రీరామశర్మ గార్ల స్మృ త్యర్థం నిర్వహించ బడినది.

**–గిరిజా శంకర్.**




PARA 9వ వార్షికోత్సవం, విశాఖ. 19జూలై న పై సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ మృదంగ విద్వాంసులు, మృదంగ అవధాన మూర్తులు శ్రీ కొమ్మాజోశ్యుల సద్గురు చరణ్ 'మృదంగ వాద్యము-లయవిన్యాస చాతురి 'అంశం పై సాధికారమైన సోదాహరణ వాద్య విన్యాసం అందించారు.



శ్రీ విజయ వినాయక స్వామి దేవస్థానం, మల్కాజగిరి లో 3-9-2026 న శ్రీ రాయపోలు సుధాకర్ వీణ కచేరి



ది.06-07-2026 న హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గాన సభ హాలులో జరిగిన కార్యక్రమం. సంగీత నాటక అకాడమీ అవార్డు పొందిన నృత్య సంగీత కళాకారులు శ్రీ కుమార సూర్యనారాయణ వారిని ప్రఖ్యాత మృదంగం విద్వాన్ పద్మశ్రీ యల్లా వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షులు శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ, శ్రీ మంగళంపల్లి సత్యనారాయణ ట్రస్టు చైర్మన్ శ్రీ సత్యనారాయణ, సన్మానం కర్త శ్రీమతి పెండ్యాల భారతి, ప్రొఫెసర్ సుదర్శన్ ఘనంగా సత్కరించారు.



డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచనలపై పోటీ విజేతలతో, ఆ అవార్డు గ్రహీత, విద్వాన్ డి.వి.మోహనకృష్ణ , అకాడమి కార్యవర్గం

Editor & Publisher : Ganakala, M.Venkatarao
30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, Cell, 9441488721